షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 202 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 05 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 198 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 1 June 2024 PAGES : 8 PRICE : 3/-

## టిటిడి ఛైర్మన్ పదవికి భూమన రాజీనామా



తిరుమల,జూన్4(షణ్ముఖ వెలుగు): తిరుమల, తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవికి భూమన కరుణాకర్ రెడ్డి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అనుంగ అనుచరుడిగా పేరున్న భూమన చిత్తూరు నియోజకవర్గం నుంచి 2019లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. సంవత్సరం క్రితం వైఎస్ జగన్ అతడికి టీటీడీ ఛైర్మన్‌గా నియమించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భూమన పోటి చేయకుండా అతడి కుమారుడు అభినయ్ రెడ్డిని వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయించారు. అయితే అతడు ఓడిపోవడంతో పాటు రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోవడంతో తన పదవికి రాజీనామా చేశారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల కౌంటింగ్ ఫలితాలలో ఏపీ ఓటర్లు ఫ్యాను రెక్కలు విరగ్గొట్టారు. చంద్రబాబు సైకిల్‌కు పట్టం కట్టారు. ఏపీ ఎన్నికల ఫలితాలలో టిడిపి కూటమి హవా కొనసాగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ నియోజకవర్గాలలో కూటమి విజయం సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభంజనం సృష్టిస్తూ టిడిపి కూటమి అభ్యర్థులు విజయాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు వందమంది కూటమి సభ్యులు విజయం సాధించగా, మరో 30 పైగా టిడిపి కూటమి సభ్యులు ఆధిక్యతలో కొనసాగుతున్నారు. ఇక తెలుగుదేశం కూటమి పార్టీల విజయం ఫైనల్ కావడంతో వ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. ఇటు రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ మరియు పార్లమెంట్ స్థానాల్లో నారా చంద్రబాబు నాయుడు అధ్వర్యంలో కూటమి ప్రభంజనం సృష్టించిందని టిడిపి వెల్లడిస్తోంది.రాష్ట్రంలోని అన్ని టీడీపీ కార్యాలయాల వద్ద కార్యకర్తలు వేడుకలకు శ్రీకారం చుట్టారు.



# సైకిల్‌కు పట్టం

## ఎపి ప్రజల విస్పష్ట తీర్పు

### టిడిపి కూటమికి అధికారం కట్టబెట్టిన ప్రజలు

### వైకాపాకు ప్రతిపక్ష హోదా కూడా కట్టబెట్టని ఓటర్లు

ఓటమి పాలయిన జగన్ మంత్రులు

- రాయలసీమలోనూ సత్తా చాటిన టిడిపి
- 21 స్థానాల్లో పోటీ చేసి అన్నింటా గెలిచిన జనసేన
- పొత్తులతో లాభపడ్డ బిజెపి నేతలు
- 9న ప్రమాణానికి చంద్రబాబు ఏర్పాట్లు
- ప్రభుత్వం ఏర్పాటుపై పవన్ కళ్యాణ్‌తో చర్చలు

అమరావతి,జూన్4(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు విస్పష్టమైన తీర్పును ప్రకటించారు. విపక్ష టిడిపికి సంపూర్ణ మెజార్టీ సాధించింది. దీంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టిడిపి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇకపోతే అధికార వైకాపాను ప్రజలు ఈడ్చి అవతల పడేశారు. 175 అసెంబ్లీ సీట్లకు గాను తాజా సమాచారం మేరకు టిడిపి 136 సీట్లను గెల్చుకోబోతున్నది. ఇకపోతే పోటీచేసిన 21 స్థానాల్లో అఖండ విజయం సాధించి జనసేన చరిత్ర సృష్టించింది. బిజెపి 7 సీట్లను గెల్చుకుంది. దీంతో కూటమికి స్పష్టమైన ఆధిక్యం లభించగా వైకాపా పదిసీట్ల వద్దే ఆగిపోయింది. కుప్పంలో చంద్రబాబు, పులివెందులలో జగన్, పిఠాపురంలో పవన్‌కళ్యాణ్, తదితరులు విజయం సాధించారు.టిడిపి ప్రముఖులంతా విజయం సాధించారు. మిగతా 2లో..

# మూడోసారి అధికారం కమలదళానిదే

### సీట్లు తగ్గినా.. అధిక్యం దిశలో ఎన్డీయే..!

### 300 మార్క్ సీట్లలో ఎన్‌డిఎ కూటమి ఆధిక్యం!!

### పలు రాష్ట్రాల్లో దాదాపు క్లీన్ స్వీప్ దిశగా బీజేపీ

- గాంధీనగర్‌లో అమిత్ షా ఘన విజయం
- రమణ్‌భాయ్‌పై 3,96,512 ఓట్ల తేడాతో గెలుపు
- భారీగా పెరిగిన కాంగ్రెస్ గ్రాఫ్
- బీహార్‌లో ఆర్జెడికి కోలుకోలేని దెబ్బ
- 29 స్థానాల్లో ఎన్‌డిఎ కూటమికి అవకాశాలు
- ఒడిశాలో ముగిసిన నవీన్ పట్నాయక్ శకం
- బీజేడీ ప్రభుత్వానికి బీజేపీ చెక్
- నవీన్ డబుల్ హ్యాట్రిక్ ఆశలకు బ్రేక్
- ఫలితాల సరళిలో వెనుకంజలో బీజేడీ
- స్పష్టమైన మెజారిటీ దిశగా బీజేపీ అడుగులు
- యూపీలో బీజేపీకి షాకింగ్ ఫలితాలు..
- గతంలో 64 సీట్లు గెలుచుకున్న ఎన్డీయే కూటమి
- 35 స్థానాల్లో మాత్రమే జయకేతనం దిశగా అడుగులు

న్యూఢిల్లీ,జూన్4(షణ్ముఖవెలుగు): సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే హ్యాట్రిక్ దిశగా దూసుకెళ్తోంది. 'ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్' నినాదంతో ఎన్నికల బరిలోకి దిగిన ఎన్డీయే.. 300 మార్క్ సీట్లలో ఆధిక్యం ప్రదర్శిస్తోంది. గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో దాదాపు క్లీన్ స్వీప్ దిశగా సాగుతోంది. యూపీ, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్ లాంటి పెద్ద రాష్ట్రాల్లో నెక్ టు నెక్ ఫైట్ నడుస్తోంది. దేశం లోనే అత్యధిక లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇండియా కూటమి హవా కొనసాగుతోంది. మిగతా 2లో..

# వైనాట్ 11..

- దేవుడి స్క్రిప్ట్ రివర్స్
- వైనాట్ 175కు దిమ్మతిరిగే సమాధానం
- ఒక్క ఛాన్స్ సిఎం జగన్‌కు ప్రజల రిటర్న్ గిఫ్ట్



అమరావతి,జూన్4(షణ్ముఖ వెలుగు): వైనాట్ 175 అన్న జగన్‌కు ప్రజలు గట్టి దెబ్బ కొట్టారు. కేవలం 15 సీట్లకే పరిమితం చేసేలా ఉన్నారు. ప్రతిపక్షహోదా కూడా దక్కకుండా చేశారు. ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కి ప్రజావేదిక కూల్చివేతతో చేపట్టిన విధ్వంసం..ఐదేళ్లలో అంతాఇంతా కాదు. జగన్ మాటల్లో చెప్పాలంటే...



## ఏపీని ప్రజలు గెలిపించారు..

### నా హృదయం ఉప్పొంగింది: చంద్రబాబు

అమరావతి,జూన్4(షణ్ముఖ వెలుగు): కూటమి ప్రభుత్వం.. కలిసికట్టుగా రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తుందని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. " ఏపీని ప్రజలు గెలిపించారు.. నా హృదయం ఉప్పొంగింది. మరోసారి ప్రజా సేవ చేసే అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు. ఏపీ భవిష్యత్తుపై నిబద్ధతతో ఉన్న మోదీ, అమిత్ షా, నడ్డాకు ధన్యవాదాలు. పవన్, జనసేన నేతలు, పురందేశ్వరి, భాజపా నేతలకు శుభాకాంక్షలు. ఘనవిజయంలో భాగస్వామ్యులైన కార్యకర్తల కృషిని మిగతా 2లో..

## 9న సిఎంగా చంద్రబాబు ప్రమాణం

### సంపూర్ణ మెజార్టీతో టిడిపి శ్రేణుల సంబరాలు

అమరావతి,జూన్4(షణ్ముఖ వెలుగు): ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కనీ వినీ ఎరుగని విజయం సాధించడంతో చంద్రబాబు ప్రమాణస్వీకారం అంశంపై చర్చలు మొదలయ్యాయి. ఈ నెల తొమ్మిదో తేదీన అమరావతిలో ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. వైసీపీ గెలుస్తుందని మిగతా 2లో..

## ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి

### సిఎం పదవికి జగన్ రాజీనామా

- ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేశాయి
- అవ్వాతాతలు, అక్కాచెల్లెమ్మలకు మంచే చేశా
- రైతన్నలకు, విద్యార్థులకు ఎంతో మేలు చేశా
- అయినా వారి ప్రేమాను రాగాలు ఏమయ్యాయో
- ఫలితాలపై ఆవేదన వ్యక్తం చేసిన జగన్

అమరావతి,జూన్4(షణ్ముఖ వెలుగు): ఎన్నికల్లో ఓటమిపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం వెలువడ్డ ఫలితాల అనంతరం తాడేపల్లిలోని నివాసంలో సాయంత్రం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేశాయి. ఊహించని విధంగా ఫలితాలు వస్తాయని అనుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అవ్వతాతలు, అక్కాచెల్లెమ్మలు, రైతన్నలు చూయించిన ఆప్యాయత, ప్రేమానురాగాలు ఫలితాల్లో ఏమయ్యాయో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలిచాలని పెన్షన్ ను పెంచి అవ్వ,తాతల ఇంటి వద్దకే వెళ్లి మిగతా 2లో..



# రాజకీయాల్లో పడిలేచిన కెరటం

## ఎపిలో పవన్ కళ్యాణ్ భారీ హిట్టు

అమరావతి,జూన్4(షణ్ముఖ వెలుగు): మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగా అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాతో చలన చిత్ర పరిశ్రమలో అడుగు పెట్టిన పవన్ కళ్యాణ్.. ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఎదిగాడు. హిట్ ప్లాప్ లతో సంబంధం లేకుండా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులను అలరిస్తూనే ఉన్నాడు. అందరి హీరోలకు అభిమానులుంటారు. అన్న మెగా స్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో యువనేతగా మిగతా 2లో..



- కక్షపూరిత ధోరణితో పాలన చేయబోం
- ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తాం
- రైతులు, మహిళల సమస్యలకు పెద్దపీట
- జనసేనాని పవన్ కళ్యాణ్ వెల్లడి

## 5కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన



అమరావతి,జూన్4(షణ్ముఖ వెలుగు): ఆంధ్రప్రదేశ్‌లోని 5 కోట్ల మంది ప్రజలు చారిత్రత్మాక తీర్పును ఇచ్చారని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. ఏపీ ఎన్నికల్లో పోటీ చేసినా 21 అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానంలో విజయం సాధించిన సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మిగతా 2లో..

## మంగళగిరిలో లోకేశ్ ఘన విజయం

### ఓడినచోటే నిలబడి గెలిచిన యువనేత

మంగళగిరి,జూన్4(షణ్ముఖ వెలుగు): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఘన విజయం సాధించారు. గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసిన నారా లోకేష్ ఓటమి పాలయ్యారు. ఎక్కడ పోగొట్టుకున్నారో అక్కడే వెదుక్కోవాలన్నట్టుగా ఈసారి మంగళగిరి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. గత ఐదేళ్లుగా నారా లోకేష్ ఎన్నో రకాల విమర్శలను ఎదుర్కొంటూ వస్తున్నారు. మిగతా 2లో..

## కడపలో వైఎస్ షర్మిల ఓటమి

### ఎపిలో ఎక్కడా ఖాతా తెరవని కాంగ్రెస్ రాజకీయ జీవితంపై నీలినీడలు

కడప,జూన్4(షణ్ముఖ వెలుగు): వైఎస్ షర్మిల రాజకీయంగా ఓటమి చెందారు. కాంగ్రెస్ ద్వారా రాజకీయ జీవితం ప్రారంభించాలనుకున్నా ఆమెకు అవకావం దక్కలేదు. ఆమె పోటీ చేసిన కడపలో ఘోరంగా ఓటమి చెందారు. అవినాశ్ రెడ్డి చేతిలో ఆమె ఓటమి మిగతా 2లో..





# ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి

మొదటిపేజీ తరువాయి..

అక్కాచెల్లెమ్మలు, రైతన్నలు చూయించిన ఆప్యాయత, ప్రేమానురాగాలు ఫలితాల్లో ఏమయ్యాయో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలిచాలని పెన్షన్ ను పెంచి అవ్వ,తాతల ఇంటి వద్దకే వెళ్లి అందజేశాం. వారి ఆప్యాయత ఏమైందో తెలియదు. అక్క చెల్లెలకు అన్ని రకాలుగా అండగా ఉన్నాం. జీరో వడ్డీ, ఆసరా, చేయూతను అందించాం, కోటి 5 లక్షల మంది అక్క చెల్లెళ్ల ప్రేమాభిమానులు ఏమయ్యాయో తెలియదని అన్నారు. పిల్లల చదువుల కోసం 12 లక్షల తల్లులు అకౌంట్లోకి డబ్బులు జమ చేశారు. 54 లక్షల మంది రైతన్నలకు పెట్టుబడి సహాయం ఇచ్చాం . వీరి ఆప్యాయతా ఏమైందో తెలియదని అన్నారు. కోట్లాది మందికి మంచి చేసినా ఎక్కడ పొరపాటు జరిగిందో ఊహించలేక పోతున్నామని జగన్ తెలిపారు. అందరికీ మంచి జరగాలని ఆరాటపడ్డాం. ప్రజల కోసం మేలు జరుగాలని తాపత్రయపడ్డాం. ఎప్పుడు చూడని విధంగా మార్పులు తీసుకువస్తూ పేదలకు అండగా పనిచేశాం. గొప్ప పనులు చేసినా తరువాత వారి అభిమానం, ఆప్యాయత ఏమైందో తెలియని వివరించారు. ఏం జరిగిందో దేవుడికి తెలుసు. ఓటమి నెపాన్ని ఎవరిని ప్రశ్నించమని, ప్రజల తీర్పును శిరసా వహిస్తామని పేర్కొన్నారు. పేదలకు అండగా ఉంటాం . పేదల పక్షాన అసెంబ్లీ లో ప్రతిపక్షంగా గళం విప్పుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకులకు అభినందనలు తెలిపారు. ప్రతిపక్షంలో ఉండడం తమకు కొత్తేమి కాదని, రాజకీయ జీవితంలో ఎవరూ చూడని కష్టాలు అనుభవించాం. అంతకన్నా కష్టాలు ఇప్పుడు పెట్టినా కూడా సిద్ధంగా ఉన్నాం. సిద్ధంగా ఎదుర్కొంటామని ఆయన వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఓటమిని అంగీకరిస్తూ సీఎం పదవికి రాజీనామా చేశారు. గవర్నర్‌కు తన రాజీనామా లేఖ పంపించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించి వైసీపీ ఘోర పరాభవం పాలైంది. కనీసం జనసేన పార్టీ సాధించినన్ని సీట్లు కూడా చేజిక్కించుకోకపోయింది. ఎన్నికల ముందు 'వై నాట్ 175' అన్న వైసీపీ నేతలు ఇప్పుడు ఎన్నికల ఫలితాలు చూసి ఒక్కసారిగా ఖంగుతింటున్నారు. బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, బుగ్గన రాజేంద్రనాథ్, అంజాద్ బాషా, ఉషశ్రీ చరణ్, రాజన్న దొర, కొట్టు సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, ఆర్కే రోజా, కాకాణి గోవర్ధన్ రెడ్డి, దాడిశెట్టి రాజా, అంబటి రాంబాబు, విడదల రజిని, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, చెల్లబోయిన వేణు, జోగి రమేశ్ సహా పలువురు కీలక నేతలు ఇప్పటి వరకూ ఓటమి బాటలో ఉన్నారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు, నేతలు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఓటమికి బాధ్యత వహిస్తూ సీఎం పదవికి జగన్ రాజీనామా చేసేశారు. కాగా, 175 అసెంబ్లీ స్థానాలకు వైసీపీ కేవలం 10 స్థానాల్లో మాత్రమే లీడింగ్‌లో ఉంది. తెలుగుదేశం జనసేన- బీజేపీ కూటమి అత్యధిక స్థానాల్లో ఆధిక్యంలో దూసుకెళ్తోంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రౌండ్‌లోనూ కూటమి అభ్యర్థులే లీడింగ్‌లో కొనసాగుతున్నారు. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 132 స్థానాల్లో లీడింగ్‌లో ఉండగా.. ఆరు స్థానాలకుపైగా కైవసం చేసుకుంది. అధికార వైసీపీ కేవలం 11 స్థానాల్లో మాత్రమే ముందంజలో కొనసాగుతోంది. ఇక జనసేన 21 స్థానాలు, బీజేపీ 8 స్థానాల్లో లీడింగ్‌లో ఉన్నాయి.

# రాజకీయాల్లో పడిలేచిన కెరటం

మొదటిపేజీ తరువాయి..

రాజకీయంలో అడుగు పెట్టాడు. రాజకీయంగా అన్నతో విబేధించి ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిన పవన్ కళ్యాణ్ అనూహ్యంగా జనసేన పార్టీని స్థాపించాడు. అయితే 2014 లో నవ్యాంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయకుండా ఎన్డీయే కూటమికి బేషరత్తుగా తన మద్దతు ప్రకటించాడు. ప్రభుత్వం పని తీరు నచ్చక పోతే నేను ప్రశ్నిస్తా అని అన్న జనసేనాని.. అప్పటి నుంచి అధికారంలో ఉన్న పార్టీ ఏదైనా తనకు అన్యాయం అన్న విషయంపై, ప్రభుత్వంలో జరిగే అవకతవకలపై తన గళం వినిపిస్తూనే ఉన్నాడు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి వెళ్ళిన పవన్ కళ్యాణ్ ఘోర పరాజయాన్ని పొందాడు. తాను పోటీ చేసిన విశాఖ, భీమవరం నుంచి మాత్రమే కాదు.. ఒక్క రాజోలు నియోజక వర్గం ఎమ్మెల్యే రాపాక మినహా మిగిలిన జనసేన అభ్యర్థులు కూడా ఓటమి పాలయ్యారు. అప్పుడు సర్వత్రా విమర్శలను ఎదుర్కొన్నాడు. వైసిపీ ప్రభుత్వం, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తీరుపై సునిసిత విమర్శలు చేస్తూ.. ప్రజలు కష్టాల్లో తానున్నాను అంటూ భరోసాగా నిలిచాడు. అన్నదాతలకు మాత్రమే కాదు చేనేత కార్మికులకు.. ఇలా బాధితులకు అండగా నిలిచాడు. తన సొంత డబ్బులకు బాధిత కుటుంబాలకు ఇచ్చి అండగా నిలిచాడు. అంతేకాదు.. ఏపీలో ఎన్నికల సమయం దగ్గర పడుతుండగా వైసిపీకి చెక్ పె÷-టటె విధంగా రాజకీయ చతురతను చాటుకున్నాడు. చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్న సమయంలో పరామర్శకు వెళ్ళిన పవన్ హటాత్తుగా మీడియా ముందుకు వచ్చి ఎన్నికల్లో టిడిపీ, జనసేన కలిసి పోటీ చేస్తుంది అని ప్రకటించాడు. అంతేకాదు.. ఏపీ ప్రజల ప్రయోజనం కోసం తనని తానూ తగ్గించుకుని మరీ తక్కువ సీట్లతోనే పోటీకి వెళ్ళడమే కాదు.. బీజేపీని కూడా కూటమితో కలిసి నడిచేలా చేయడంలో పవన్ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే.. పిఠాపురం నుంచి బరిలోకి దిగిన పవన్ కళ్యాణ్ ను ఓడించడం కోసం అధికార వైసిపీ ప్రభుత్వం రాజకీయ ఉద్దండులను రంగంలోకి దింపింది. స్వయంగా సిఎం జగన్ .. వైసిపీ అభ్యర్థి వంగా గీతను గెలిపిస్తే డిప్యూటీ సిఎం పదవిని ఇస్తానని ప్రకటించారు. అయినప్పటికీ పవన్ కళ్యాణ్ గెలుపు నల్లేరు మీద నడకలా సాగింది. పవన్ మీద అభిమానంతో మెగా హీరోలు మాత్రమే కాదు అనేక మంది మేము సైతం అంటూ మద్దతు తెలిపారు.

## 5కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు
# అనుగుణంగా పాలన

మొదటిపేజీ తరువాయి..



రాష్ట్రంలో వైఎస్ జగన్, వైసీపీ శ్రేణులు తమకు శత్రువులుకారని తేల్చిచెప్పారు. కక్ష సాధింపు చర్యలకు ఇది సమయం కాదని 5 కోట్ల మంది ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బలమైన పునాది వేసే సమయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా జవాబుదారితనంతో పనిచేస్తామని వెల్లడించారు. ఇక ఏపీకి చీకటి రోజులు ముగిసాయని అన్నారు. కూటమి ఏపీ ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటామని అన్నారు. జనసేన 21 కి 21 సీట్లు గెలుస్తుందని అనుకోలేదు. భారతదేశంలో ఇంతవరకు జనసేనకు తప్పా ఏ పార్టీకి ఈ ఘనత దక్కలేదని సంతోషం వ్యక్తం చేవారు. వచ్చే ప్రభుత్వం అన్నం పెట్టే రైతన్నకు, ఆడబిడ్డలకు రక్షణగా ఉంటుందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ను ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాం. మెగా డీఎస్సీ బాధ్యత తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బలంగా ఉంటాయని ధీమాను వ్యక్తం చేశారు. పరిపాలనలో రాజకీయం ఉండదని భరోసా ఇచ్చారు. 2019లో నేను ఓడిపోయినా నాకున్న మానసిక స్థితి ఎలా ఉందో నేడు గెలిచినా అదే మానసిక స్థితి నాలో ఉందని, అదే ధైర్యంతో ఉన్నానని పేర్కొన్నారు. గెలుపు భయమేసినా అంతకంటే రెట్టింపుగా పనిచేసే బాధ్యత తమపై ఉందని అన్నారు. జనసేన ధర్మం కోసం నిలబడిందని, ఎన్నికల్లో ధర్మమే మన కోసం నిలబడిందని అన్నారు. వచ్చే రోజుల్లో నిర్మాణాత్మకంగా పనిచేస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రజలకు చసేవచేసే లక్ష్యం మాదని, అందుకే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాం అన్నారు. జవాబుదారీతనంతో కూడిన రాజకీయ ప్రభుత్వం, ఆలోచనా విధానం ఉంటుందన్నారు. జీవితమంతా దెబ్బలు తింటూ, మాటలు పడుతూ ఎదుగుతూ వచ్చాను. ఇకపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాల్సి ఉంటుంది. ఈ విజయం జనసేన, జనసైనికులు, వీరమహిళలది మాత్రమే కాదు. ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షదన్నారు. మార్పు కావాలి. పాలన మారాలి. ఆలోచన నుంచి వచ్చిన విజయమిది. యువత, ఆడబిడ్డలు పడిన ఇబ్బందులను మరచిపోలేదు. రోడ్లు వేయకుండా గుంతలు వేశారు. అరాచకాలు చేశారు. రాష్ట్రంలో శాంతి ద్రతలను కాపాడే బాధ్యత మాది. అధికారులపై రాజకీయ ఒత్తిడి ఉండదు. రైతుకు కష్టమొస్తే అక్కున చేర్చుకునే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. రాజకీయాల్లో నాకు డబ్బు అవసరం లేదు. డబ్బుకోసం, పేరుకోసం రాజకీయాల్లోకి రాలేదని పవన్ స్పష్టం చేశారు.

# కడపలో వైఎస్ షర్మిల ఓటమి

మొదటిపేజీ తరువాయి..

పాలయ్యారు. అలాగే కాంగ్రెస్ ఎక్కడా కాతా తెరవలేదు. కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఎపిలో రాజకీయం ప్రారంభించిన ఆమెకు చేదు అనుభవమే మిగిలింది. ప్రతిపక్షనేత వైయస్ జగన్ అక్రమాస్తుల కేసులో 16 నెలలు చంచల్‌గూడ జైల్లో ఉంటే.. సోదరుడికి మద్దతుగా, పార్టీని ప్రజల్లో నిలబెట్టడం కోసం వేలాది కిలోమీటర్ల మేర ఆమె పాదయాత్ర సైతం చేసిందని పేర్కొంటున్నారు. ఇక 2019 ఎన్నికల్లో వైయస్ జగన్ ముఖ్యమంత్రి కావడంతో.. అతడితో విభేదాలు వచ్చాయని చెబుతున్నారు. దీంతో వైయస్ షర్మిల పక్క రాష్ట్రం తెలంగాణ వెళ్లి.. వైయస్ఆర్ తెలంగాణ పార్టీ స్థాపించిందని వివరిస్తున్నారు. ఆ క్రమంలో ఆ రాష్ట్రంలో రాజకీయంగా వైయస్ షర్మిల తీవ్ర వ్యతిరేక పరిస్థితులను సైతం ఎదుర్కొన్నారని వైయస్ఆర్ అభిమానులు ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. దీంతో వైయస్ఆర్ టీపీని తన ప్రాణానికి ప్రాణంగా ప్రేమించి కన్నతండ్రికి అత్యంత ఇష్టమైన కాంగ్రెస్ పార్టీలో ఆమె విలీనం చేశారని చెబుతున్నారు. అనంతరం ఏపీ పీసీసీ అధ్యక్ష బాధ్యతలు సైతం ఆమె చేపట్టారని.. దీంతో కడప లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేసి వైయస్ షర్మిల ఓడారని వారు వివరిస్తున్నారు. ఈ దశాబ్ద ప్రయాణంలో రాజన్న ముద్దుబిడ్డ వైయస్ షర్మిల పరిస్థితి దాదాపుగా అన్నింటిని కోల్పోయిందని వైయస్ఆర్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే వైయస్ జగన్‌తో ఉన్న రక్తబంధం తెగిపోయిందని.. అలాగే మెట్టినిల్లు తెలంగాణలో రాజకీయం చేసి... మళ్లీ పుట్టినిల్లు ఆంధ్రప్రదేశ్ తిరిగి వచ్చేసిందని వివరిస్తున్నారు. తాజాగా కడప ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిందని చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తన తండ్రి తుది శ్వాస వరకు కొనసాగిన హస్తం పార్టీతోనే తన స్నేహ హస్తం ఇచ్చి కొనసాగిస్తుందా లేకుంటే.. అనుబంధం అత్మీయ అంతా ఒక బూటకం అంటూ సైలెంట్‌గా సైడ్ అయిపోతారా అని వైయస్ షర్మిల రాజకీయ భవిష్యత్తుపై మహానేత అభిమానులు ఓ విధమైన నిర్వేదంతో చర్చించుకుంటున్నారు.

## మంగళగిరిలో లోకేశ్
# ఘన విజయం

మొదటిపేజీ తరువాయి..

మంగళగిరిలో ఓటమి పాలయ్యారంటూ వైసీపీ నేతలు ఆయనను ఎన్నో విధాలుగా అవమానించారు. వాటన్నింటికీ నారా లోకేష్ తన విజయంతో సమాధానం చెప్పారు. తానేమీ తన కంచుకోట నుంచి పోటీ చేయడం లేదని.. టీడీపీ వీక్‌గా ఉన్న స్థానం నుంచి పోటీ చేశానని.. తిరిగి అదే స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధిస్తానని లోకేష్ పలుమార్లు చెప్పారు. ఇప్పుడు ఆయన విజయం వైసీపీకి చెంపపెట్టు అని చెప్పాలి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని చరిత్ర సృష్టించే దిశగా పరుగులు తీస్తోంది. ఇప్పటి వరకూ విజయం సాధించిన టీడీపీ అభ్యర్థులు ఎవరెవరంటే.. రాజమండ్రి గ్రామీణంలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి... రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి వాసు... కొవ్వూరులో టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు.. గాజువాకలో పల్లా శ్రీనివాసరావు.. పాలకొల్లులో నిమ్మల రామానాయుడు.. ఉరవకొండలో పయ్యావుల కేశవ్.. ప్రొద్దుటూరులో వరదరాజుల రెడ్డి విజయం సాధించారు. ఇక అనపర్తి నుంచి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి విజయం సాధించారు. నిమ్మల రామానాయుడు 69 వేల మెజార్టీతో విజయం సాధించడం విశేషం. అనపర్తిలో బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించారు.

## మూడోసారి అధికారం
# కమలదళానిదే



మొదటిపేజీ తరువాయి..

అక్కడి 80 స్థానాల్లో మెజారిటీ స్థానాలు కూటమి కైవసం చేసుకోబోతుంది.. ఇప్పటికే 40కి పైగా స్థానాల్లో ఇండియా కూటమి ఆధిక్యం కనబరుస్తోండగా.. బీజేపీ 36 స్థానాల్లో మాత్రమే లీడింగ్ లో ఉంది. గత ఎన్నికల్లో 62 స్థానాలు ఈ రాష్ట్రం లోనే గెలిచిన బీజేపీకి, ఈ సారి ఎదురు గాలి వీస్తోంది. మహారాష్ట్రలో మొత్తం 48 స్థానాలు ఉండగా.. ఎన్డీయే, ఇండియా కూటముల మధ్య టఫ్ ఫైట్ నడుస్తోంది. ఇప్పటి వరకు జరిగిన కౌంటింగ్ లో 26 స్థానాల్లో ఎన్డీయే, 20 స్థానాల్లో ఇండియా కూటమి ఆధిక్యంలో ఉంది. వెస్ట్ బెంగాల్ లోనూ తృణమూల్ కాంగ్రెస్ హవా కనిపిస్తోంది.. గత ఎన్నికల్లో 22 స్థానాలు సాధించిన టీఎంసీ.. ఈ సారి కూడా 22 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. అయితే, 2019 ఎన్నికల్లో 18 స్థానాలు గెలిచిన బీజేపీ మాత్రం 12 స్థానాల్లోనే లీడింగ్ లో ఉంది.. మెజారిటీ స్థానాలు సాధించాల్సిన పెద్ద రాష్ట్రాల్లోనే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి వ్యతిరేక పవనాలు వీస్తుండటంతో.. భారీ మెజారిటీపై అంచనాలు పెట్టుకున్న ఎన్డీయే 3 వందల స్థానాల దగ్గరే ఆగి పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఎన్డీఏ కూటమికి తొలి విజయం దక్కింది. గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి పోటీచేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా గెలుపొందారు. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి సోనాల్ రమణ్‌భాయ్‌పై 3,96,512 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో అమిత్ షాకు 5,06,731 ఓట్లు రాగా, రమణ్‌భాయ్‌కి 1,10,219 ఓట్లు పోలయ్యాయి. ఇక బహుజన్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మహమ్మద్ అనీశ్ దేశాయ్‌కి డిపాజిట్ దక్కలేదు. ఆయనకు 3,244 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాగా, కేంద్రంలో ఎన్డీయే మరోసారి ప్రభుత్వ ఏర్పాటు దిశగా కొనసాగుతున్నది. ఇప్పటివరకు 297 చోట్ల ఎన్డీఏ కూటమి ఆధిక్యంలో కొనసాగుతుండగా, ఇండియా బ్లాక్ 225 స్థానాల్లో మెజార్టీలో ఉన్నది. ఇప్పటివరకు ఇరు కూటములు ఒక్కో చోట విజయం సాధించారు. మరో 19 సీట్లలో ఇతరులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

బీహార్‌లో ఆర్జేడీకి కోలుకోలేని విధంగా ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలోని మొత్తం 40 స్థానాల్లో అత్యధిక స్థానాల్లో ఎన్డీఏ కూటమి దూసుకుపోతున్నది. సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ 13 సీట్లలో లీడ్‌లో ఉండగా, బీజేపీ 11 చోట్ల, లోక్‌జనశక్తి 5 చోట్ల తిరుగులేని ఆధిక్యంలో దూసుకుపోతున్నాయి. ఇక ఇండియా కూటమిలోని ఆర్జేడీ 4, సీపీఐఎంఎల్ 2, సీపీఐ, కాంగ్రెస్, హెచ్ఎంఎస్ ఒక్కో చోట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. ఇతరులు 2 సీట్లలో లీడ్‌లో ఉన్నారు.

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుమార్తె మీసా భారతి పాటలీపుత్రలో బీజేపీపై 6,665 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇక సరన్‌లో పోటీచేస్తున్న లాలూ చిన్న కుమార్తె రోహిణి ఆచార్యపై బీజేపీ అభ్యర్థి 998 ఓట్ల మెజార్టీతో ఉన్నారు. ఈ క్రమంలో దేశ రాజకీయాలు మారుతున్నాయి. ఇప్పుడు అంతా మోడీకి వ్యతిరేకంగా జట్టు కట్టే ఛాన్స్ కోసం చూస్తున్నారు. యూ-టర్న్ రారాజు'గా పేరొందిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మరోసారి యూ-టర్న్ తీసుకోబోతున్నారా? సార్వత్రిక ఎన్నికల ముంగిట ఇండియా కూటమిని వీడి ఎన్డీఏలో చేరిన ఆయన.. ఇప్పుడు తిరిగి ఇండియా కూటమిలోకి వెళ్లబోతున్నారా? ప్రస్తుత పరిస్థితుల్ని బట్టి చూస్తే.. ఆ ప్రశ్నకు అవుననే సమాధానాలే రాజకీయ విశ్లేషకుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. అఫ్‌కోర్స్.. ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్డీఏ మ్యాజిక్ ఫిగర్‌ని దాటేసిన మాట వాస్తవమే. కానీ.. ఇండియా కూటమికి వచ్చిన స్థానాలు మాత్రం ఎవ్వరూ ఊహించనివి. ఎన్నికల ముందు బీజేపీ హవా ఎక్కువగా ఉండటం చూసి.. ఇండియా కూటమికి కనీసం 150 స్థానాలు కూడా రాకపోవచ్చని అందరూ అంచనా వేశారు. ఎగ్జిట్ పోల్స్ కూడా అవే లెక్కలు చెప్పాయి. ఈసారి ఎన్డీఏ 350కి పైగా స్థానాలతో భారీ విజయం సాధిస్తుందని, ఇండియా కూటమి 150 స్థానాల్లోపే పరిమితం కావొచ్చని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. కానీ.. ఆ అంచనాలకు భిన్నంగా కూటమి దూసుకుపోతోంది. 230 నుంచి 240 స్థానాల్ని కైవసం చేసుకునే అవకాశం కనిపిస్తోంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్ అయిన 272కు దరిదాపుల్లో ఆ కూటమి ఉంది. ఇలాంటి తరుణంలో.. నితీశ్ కుమార్ తిరిగి ఇండియా అలయన్స్‌లోకి వస్తే, కూటమి విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు. కొన్ని రోజుల క్రితమే.. ఆర్జేడీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ ఒక పెద్ద ప్రకటన చేశారు. తన పార్టీని కాపాడుకోవడం కోసం నితీశ్ కుమార్ ఏమైనా చేస్తారని, అందుకోసం జూన్ 4వ తేదీ తర్వాత ఎంత పెద్ద నిర్ణయమైనా తీసుకోవచ్చని కుండబద్దలు కొట్టారు. అంటే.. ఇండియా కూటమిలోకి ఆయన తిరిగి రావొచ్చని పరోక్ష సంకేతాలు ఇచ్చారు. అసలే ఇండియా కూటమి ఏర్పాటులో నితీశ్ కుమార్ అత్యంత కీలక పాత్ర పోషించారు కాబట్టి.. ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా ఆయన కూటమిలోకి తిరిగొచ్చినా ఆశ్చర్యనపోనక్కర్లేదు. ఒకవేళ అదే జరిగితే మాత్రం.. ఎన్డీఏకు ఆయన గండి కొట్టినట్టే! అప్పుడు ఇండియా కూటమికే గెలుపవకాశాలు ఉంటాయి. కేవలం నితీశ్ కుమార్ రావడంతో ఇండియా కూటమికి ఆధిక్యం దక్కకపోవచ్చు. కానీ, ఆయన ఇచ్చే ట్విస్ట్‌కి ఇతర ప్రాంతీయ పార్టీలూ ఇండియా కూటమికి మద్దతు ఇవ్వొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ ఇండియా కూటమి 240 స్థానాల్లో నెగ్గి, అటు జనతాదళ్ (యూ) బిహార్‌లో 13-14 సీట్లు గెలిస్తే.. అప్పుడు ఇండియా కూటమి ఖాతాలోకి 253-254 సీట్లు వచ్చి చేరుతాయి. మరోవైపు.. బీజేపీ మ్యాజిక్ ఫిగర్‌కి అటుఇటుగా స్థానాల్ని కైవసం చేసుకోవచ్చు. కాబట్టి.. ఇండియా కూటమి గెలవాలంటే, ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు కూడబెట్టుకోవాల్సి వస్తుంది. మరి.. ÷నైల్ రిజల్ట్స్ ఎలా వస్తాయో చూడాలి. ఒడిశా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో అధికార బిజూ జనతాదళ్ పార్టీ ఫలితాల సరళిలో వెనుకంజలో ఉంది. దాదాపు ఓటమి దిశగా పతనం అంచున పయనిస్తోంది. ఇప్పటి వరకు వరుసగా ఐదుసార్లు ఆ రాష్ట్రంలో అధికారాన్ని సొంతం చేసుకున్న బీజూ జనతా దళ్(బీజేడీ) అధినేత నవీన్ పట్నాయక్.. ఈ సారి డబుల్ హ్యాట్రిక్‌పై కన్నేశారు. కానీ నవీన్ పట్నాయక్ ఆశలు ఆవిరయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధికార బిజూ జనతా దళ్ తర్వాత స్థానంలో ఉంది. ఈ దఫా ఒడిశాలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు బీజేపీ నుంచి గట్టి పోటీనే ఎదురైంది. సంబల్ పుర్‌లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఆధిక్యంలో ఉండగా, పూరీ నుంచి సంబిత్ పాత్రా ముందంజలో ఉన్నారు. బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్ కంటాబాంజీ నుంచి ఆధిక్యంలో కొనసాగుతున్నారు.ఒడిశా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అధికార బిజూ జనతాదల్ (బీజేడీ) వెనుకబడింది. నవీన్ పట్నాయక్ ఆరోగ్యంపై బీజేపీ చేసిన వ్యతిరేక ప్రచారం వర్కవుట్ అయినట్లు కనిపిస్తోంది. ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ ఆరోగ్యం క్షీణించడంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు అప్పట్లో దుమారం రేపాయి. దీనిపై నవీన్ పట్నాయక్ మోదీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. కాగా సుదీర్ఘ కాలంగా పవర్‌లో ఉన్న బీజేడీపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చినట్లు కనిపిస్తోంది.మొత్తం 147 సీట్లున్న ఒడిశా అసెంబ్లీలో బీజేపీ 74, బీజేడీ 46 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నాయి. ఫలితాల సరళి ప్రకారం బీజేపీ ఆధిక్యం ప్రదర్శిస్తోంది.

## 9న సిఎంగా
# చంద్రబాబు ప్రమాణం

మొదటిపేజీ తరువాయి..

తొమ్మిదో తేదిన విశాఖలో జగన్ ప్రమాణస్వీకారం చేస్తారని ఆ పార్టీ నేతలు చెబుతూ వచ్చారు. అయితే టీడీపీ గెలుస్తుందని.. చంద్రబాబు అమరావతిలోనే ప్రమాణం చేస్తారని ఆ పార్టీ నేతలు చెబుతూ వచ్చారు. ఇప్పుడు అనూహ్యమైన విజయం సాధించడంతో అమరావతిలో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయనున్నారు. 9న ఆయన సిఎంగా ప్రమాణం చేయను న్నారు. ఈ క్రమంలో రాత్రికి పవన్ కళ్యాణ్‌తో చంద్రబాబు చర్చలు జరుపనున్నారు. ఇదిలావుంటే ఏపీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. విజయం దిశగా కూటమి అభ్యర్థులు దూసుకెళ్తు న్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తెదేపా కార్యాలయానికి కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో సందడి నెలకొంది. అదేవిధంగా విశాఖ, మంగళగిరిలోని తెదేపా కార్యాలయాల వద్ద పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

# ఏపీని ప్రజలు గెలిపించారు..

మొదటిపేజీ తరువాయి..

మరిచిపోలేను. కూటమి విజయానికి శుభాకాంక్షలు తెలిపిన మోదీకి అభినందనలు. ఎన్డీయేకు ఏపీ ప్రజల తరఫున శుభాకాంక్షలు. ప్రజలు ఎంతో నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ విజయం కూటమిపై ప్రజల నమ్మకానికి ప్రతిబింబం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. .

ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించింది. మొత్తం 25 స్థానాల్లో తెదేపా 16, భాజపా 3, జనసేన 2 స్థానాల్లో గెలుపు/ఆధిక్యంలో ఉన్నారు. వైకాపా రెండు స్థానాలు గెలుచుకొని మరో రెండుచోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. కూటమి అభ్యర్థుల్లో చాలా మంది 2లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించడం విశేషం. ఎన్డీయే కూటమిలోని టీడీపీ 144 సీట్లలో పోటీ చేసి 135 స్థానాల్లో గెలిచింది. జనసేన 21 స్థానాల్లో పోటీ చేయగా 21 సీట్లను కైవసం చేసుకుంది. ఇక, బీజేపీ 10 సీట్లలో పోటీ చేయగా.. 8 చోట్ల గెలుపొందింది. గత ఎన్నికల్లో 151 సీట్లు గెలిచిన వైసీపీ.. ఈసారి 11 సీట్లకే పరిమితమైంది. మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్డీయే కూటమి 164 సీట్ల అఖండ మెజారిటీతో అధికారాన్ని కైవసం చేసుకుంది.

# వైనాట్ 11..

మొదటిపేజీ తరువాయి..

అవును.. అక్షరాలా దేవుడి స్క్రిప్టే..! ఏపీ ఎన్నికల ఫలితాలతో సీన్ మొత్తం రివర్స్ అయిపోయింది..! 2019 ఎన్నికల్లో 23 సీట్లకే టీడీపీ పరిమితం కావడంతో.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలా హేళన చేసిందో.. ఎంతలా కించపరుస్తూ మాట్లాడిందో అందరికీ గుర్తుండే ఉంటుంది..! తనను ఎదుర్కోలేక పొత్తులు పెట్టుకున్నారంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఒక్క మంచి పనయినా చేశాడా అని నిలదీశారు. నేరుగా డబ్బులు వేయడమే పాలన అనుకున్నాడు. అంతేకాదు.. ఆ 23లోనూ కొంతమందిని వైసీపీ లాగేసుకోగా మిగిలింది 19 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. అయినా సరే ఎక్కడా అదరక బెదరక ఒంటరిగానే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఒంటరిగానే పోరాటం చేశారు. ఇక ఎన్నికల ముందు బీజేపీ, జనసేన పార్టీలతో కూటమిగట్టిన టీడీపీ.. ఊహించని రీతిలో సీట్లు దక్కించుకున్న దంటే మామూలు విషయం కాదు.



అది కూడా టీడీపీ నంబర్ వైసీపీకి రావడం అంటే దేవుడి స్క్రిప్ట్ అంటే ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్లుగా సీట్ల రూపంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బాగానే తెలిసొచ్చినట్లుంది. వైనాట్ 175 అనే ట్రిబుల్ డిజిట్ నుంచి డబుల్ డిజిట్‌కు అది కూడా 20 లోపే సీట్లకు పరిమితం అయ్యే పరిస్థితి అంటే విధి ఎంత విచిత్రమో కదా..! అది కూడా టీడీపీతో కాదు జనసేనతో పోటీ పడి గెలవబోతోందంటే ఎక్కడ్నుంచి పరిస్థితి ఇంకెక్కడికి పడిపోయిందో కదా!. వైఎస్ జగన్ ఎప్పుడూ పైనున్న దేవుడు, ప్రజల ఆశీస్సులే గెలిపిస్తాయని అంటూ ఉంటారు కదా.. ఉన్నాయి కానీ కూటమికే ఇవన్నీ..! బహుశా వైసీపీకి ఈ పరిస్థితి వస్తుందని కలలో కూడా కార్యకర్తలు, పార్టీ నేతలు ఊహించి ఉండరేమో మరి. అందుకే అధికారం వచ్చిందని ఎగిరెగిరి పడితే పరిస్థితి ఎలా ఉంటుంది..? అభివృద్ధి పక్కనెట్టి బటన్ నొక్కడే పనిగా పెట్టుకుంటే ఇలాగే ఉంటుందని వైసీపీ అధినేతకు బాగా తెలిసొచ్చిందేమో!. ఎక్కడైతే.. అదేనబ్బా బహిరంగ సభలు, సమావేశాలు.. అసెంబ్లీలో వైఎస్ జగన్ అండ్ కో 23.. 23 అని హేళన చేశారో.. ఇప్పుడు అవే వేదికగా టీడీపీ మోతెక్కిస్తుందేమో..! ఇందులో ఎలాంటి సందేహాలు అక్కర్లేదేమో. ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా రచ్చ రచ్చ నడుస్తుండగా.. ఇప్పుడిక తెలుగు తమ్ముళ్ల ధాటి నుంచి వైఎస్ జగన్ ఎలా తట్టుకుంటారో.. ఎదుర్కొంటారో అని వైసీపీ శ్రేణులు కంగారు పడుతున్న పరిస్థితి. ఇవన్నీ కాదు.. వైఎస్ జగన్ నుంచి రియాక్షన్ ఎలా ఉంటుందా అని.. టీడీపీ కంటే ఎక్కువగా వైసీపీ శ్రేణులు ఎదురుచూస్తున్న పరిస్థితి. ఘోరాతి ఘోర ఓటమిపై ఏం మాట్లాడుతారో వేచి చూడాలి మరి.

# సైకిల్‌కు పట్టం

మొదటిపేజీ తరువాయి..

నేరుగా ప్రజలకు డబ్బుల పందేరం చేసి, విజయంపై ధీమాగా ఉన్న జగన్‌ను ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు. అభివృద్ధిని విస్మరించి, అప్పులు చేసి పంచడమే అభివృద్ధి నినాదంగా వెళ్లిన వైకాపాకు గట్టి గుణపాఠం చెప్పారు. ఈ క్రమంలో సిఎం పదవికి జగన్ రాజీనామా చేయగా కొత్త సిఎంగా చంద్రబాబు 9న అమరావతిలోనే ప్రమాణం చేయబోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటుపై జనసేనాని పవన్ కళ్యాణ్‌తో కలసి చర్చించనున్నారు. ఎపిలో అవినీతి, అక్రమాలతో పాటు, రాక్షసకాండ సాగించిన వైకాపాను గట్టిగా బుద్ధి చెప్పారు. అధికారానికి పనికిరావని తీర్పు చెప్పారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా టిడిపి కూటమి 25కు 21 స్థానాల్లో విజయం సాధించే దిశగా ఉంది. వైకాపా కేవలం 4 సీట్లకే పరిమితం అయ్యింది. ఈ క్రమంలో గత ఐదేళ్లు సాగించిన అరాచక పాలనకు వైకాపా మూల్యం చెల్లించుకుంది. ఎన్నికల ఫలితాల్లో ఆ పార్టీ దారుణ ఓటమి మూటగట్టుకుంది. కౌంటింగ్ ప్రారంభం నుంచి ఏ దశలోనూ తెదేపా నేతృత్వంలోని కూటమికి కనీస స్థాయి పోటీ ఇవ్వలేకపోయింది. చివరకు ప్రతిపక్ష హోదా కూడా కోల్పోవడం గమనార్హం. ఆ హోదా రావాలంటే 18 మంది ఎమ్మెల్యేలు గెలుపొందాలి. కానీ వైకాపా మాత్రం.. 8-10 సీట్లకే పరిమితమైంది. వార్ వన్ సైడ్' అన్నట్లుగా కూటమి దుమ్మురేపింది. జగన్ నియంతృత్వ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడుతూ.. కూటమికి ఘన విజయం కట్టబెట్టారు. ఇప్పటికే 117 స్థానాల్లో విజయం సాధించిన



కూటమి అభ్యర్థులు.. మరో 17 చోట్ల ఆధిక్యంలో ఉన్నారు. వైకాపా కంటే మెరుగ్గా జనసేన సొంతంగానే 21 స్థానాల్లో గెలుపొందింది. మొదటినుంచి ఫలితాల సరళి చూసి వైకాపాకు ప్రతిపక్ష హోదా అయినా దక్కుతుందా? అని రాజకీయ వర్గాల్లో అనుమానాలు వ్యక్తం కాగా.. చివరకు అదే నిజమైంది. ఇకపోతే ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమి అదరగొట్టింది. మొత్తం 13 ఉమ్మడి జిల్లాలకుగానూ 8 జిల్లాల్లో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎనిమిది జిల్లాల్లో 110 సీట్లు ఉండగా.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 110 సీట్లలో విజయం సాధించింది. ఉమ్మడి విశాఖ, ప్రకాశం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలోని మొత్తం 10 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ఉమ్మడి విశాఖలో 2, ఉమ్మడి ప్రకాశంలో ఒకటి, ఉమ్మడి కడప జిల్లాలో మూడు, కర్నూలు జిల్లాలో 2, చిత్తూరు జిల్లాలో 2 నియోజకవర్గాల్లో మాత్రమే వైసీపీ విజయం సాధించింది.

ఐదు జిల్లాల పరిధిలోని 65 నియోజకవర్గాలకు కేవలం 10 చోట్ల మాత్రమే వైసీపీ విజయం సాధించింది. మిగతా 55 నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. శ్రీకాకులం జిల్లాలో పది నియోజకవర్గాలకు 8 నియోజకవర్గాల్లో టీడీపీ పోటీచేయగా అన్ని స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ, జనసేన చెరో స్థానంలో పోటీచేయగా.. ఆ రెండు చోట్ల బీజేపీ, జనసేన అభ్యర్థులు విజయం సాధించారు. విజయనగరం జిల్లాలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా టీడీపీ 8 స్థానాల్లో జనసేన ఒక చోట విజయం సాధించాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా టీడీపీ 13, జనసేన ఐదు, బీజేపీ ఒక స్థానంలో విజయం సాధించాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా టీడీపీ 9, జనసేన 6 స్థానాల్లో పోటీచేయగా.. ఆ రెండు పార్టీలు పోటీచేసిన అన్ని స్థానాల్లో గెలుపొందారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 నియోజకవర్గాలు ఉండగా.. టీడీపీ 13, బీజేపీ 2, జనసేన ఒక స్థానంలో పోటీచేయగా.. ఆ మూడు పార్టీలు అన్ని స్థానాల్లో విజయం సాధించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 17 నియోజకవర్గాలు ఉండగా టీడీపీ 16, జనసేన ఒక నియోజకవర్గంలో పోటీచేయగా.. అన్ని స్థానాల్లో గెలుపొందాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండగా.. టీడీపీ 13, బీజేపీ ఒకచోట విజయం సాధించాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 నియోజకవర్గాలు ఉండగా.. అన్ని చోట్ల టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఉమ్మడి విశాఖలోని అరకు, పాడేరులో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, ఉమ్మడి కడప జిల్లాలో బద్వేలు, రాజంపేట, పులివెందులలో మాత్రమే వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మంత్రాలయం, ఆలూరులో వైసీపీ గెలుపొందింది. చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె, పుంగనూరులో మాత్రమే వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. మంత్రులంతా ఓటమి చెందారు. జగన్ మాత్రమే పులివెందులలో విజయం సాధించారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 05.06.24
బుధవారం

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

# ప్రకాశం

## ఉమ్మడి ప్రకాశంలో

# టిడిపి కూటమి ప్రభంజనం







పప్పు బెల్లాలుగా మారిన వైసీపీ పథకాలు

కూటమి కట్టినప్పుడే సగం విజయం ఖాయం

వైపాలెం, దర్శి సీట్లకే పరిమితమైన వైసీపీ

ఒంగోలు ఎంపిగా మాగుంట విజయకేతనం









4











# ఉమ్మడి నెల్లూరు జిల్లా క్లీన్ స్వీప్ చేసిన టిడిపి కూటమి





**(షణ్ముఖ వెలుగు బ్యూరో, నెల్లూరు, జూన్ 4)**

గూడూరు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి పాశం సునీల్ కుమార్ వైసిపి అభ్యర్థి మేరిగ మురళి మీద 19,915 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పాశం సునీల్ 2014లో వైసిపి పార్టీ నుంచి పోటీ చేసి మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటిలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీలో చేరారు. 2019లో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తిరిగి 2024లో ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండవసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సర్వేపల్లి నియోజకవర్గం నుండి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వై సిపి అభ్యర్థి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పై 15,994 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొదట మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మెజారిటీతో ఉన్నారు. ఆ తరువాత స్వల్ప ఆదిక్యతతో ప్రారంభమై మంత్రి కాకాణితో పోరాడి ఎట్టకేలకు సోమిరెడ్డి విజయం సాధించారు. కోవూరు నుండి నెల్లూరు ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వైసీపీ అభ్యర్థి, మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పై 49,996ఓట్ల మెజారిటీతో అఖండ విజయాన్ని సాధించారు. గతంలో కోవూరు నుండి మహామహులు పోటీ చేసిన ఈ నియోజకవర్గంలో మెట్టమొదటి సారిగా ఒక మహిళ గెలుపొందడం కోవూరు నియోజకవర్గానికే కాకుండా నెల్లూరు జిల్లాకు తలమానికం అయ్యారు. ఆత్మకూరు నియోజకవర్గం నుండి మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వైసిపి అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డితో హెూరా హెూరిన పోటీ పడి ఎట్టకేలకు 7106ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి యంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో మొదటి నుంచి కూడా మెజారిటీతో 31,971ఓట్ల మెజారిటీతో మూడోసారి ఎమ్మెల్యేగా గొలుపొందడం విశేషం. వెంకటగిరి నియోజకవర్గం నుండి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వైసిపి అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి పై 15,454 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నుండి డాక్టర్ నెలవల విజయశ్రీ వైసిపి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో 29115 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నెల్లూరు నగరం నుండి మాజీ మంత్రి పొంగూరు నారాయణ వైసిపి అభ్యర్థి ఖలీల్ అహ్మద్ పై 70,513 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కావలి నియోజకవర్గం నుండి దగ్గుమాటి వెంకటకృష్ణ రెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) వైసిపి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పై 29,700 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఉదయగిరి నియోజకవర్గం నుండి కాకర్ల సురేష్ వైసిపి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పై 9,566 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. (తరువాయి 4లో...)

# ఉమ్మడి ప్రకాశంలో టిడిపి కూటమి ప్రభంజనం

(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 4)

ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి ప్రభంజనం సృష్టించింది. ఫలితాల్లో సునామీ సృష్టిస్తూ దూసుకెళ్తోంది. ఊహించనన్ని స్థానాలు గెలుచుకుంది. సర్వే సంస్థల అంచనాలను తలకిందులు చేస్తూ నెంబర్ గేమ్‌లో పరుగులు పెడుతోంది. ఇదే క్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో 10 అసెంబ్లీ స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. వైసీపీ వైపాలెం, దర్శి రెండు స్థానాలకే పరిమితమైంది. దీంతో జి ల్లా మొత్తం పసుపు మయంగా మారింది. ఏ నలుగురు గుమి కూడినా రాజకీయాలే చర్చించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో టిడిపి ఇంతటి ఘన విజయం సాధించిన సంధర్భాలు లేవంటూ పేర్కొంటున్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు పోటీ చేయగా సంతనూతలపాడులో మేరుగ నాగార్జున ఓటమిపాలయ్యారు. యర్రగొండపాలెంను కాదని కొండపికి పంపిన మరో మంత్రి ఆదిమూలపు సురేష్ ఐదేళ్ల పాటు రెండు దఫాలుగా ఉన్నతమైన మంత్రి పదవులు నిర్వర్తించినా సార్వత్రిక ఎన్నికల్లో చతికలపడ్డారు. ఈ క్రమంలో గెలిచిన అభ్యర్థుల్లోనూ ఈ పాటికే మంత్రి పదవులపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చంద్రాబాబు మార్పు పాలన కొనసాగుతుందా అని ప్రజలు సైతం చర్చించుకుంటున్నారు.

**పప్పు బెల్లాలుగా మారిన వైసీపీ పథకాలు**

సంక్షేమ పథకాలన్నీ పప్పు బెల్లాలుగా మారాయే తప్ప వైసీపీకి ఒరిగిందేమీ లేదంటూ చర్చించుకుంటున్నారు. గెలిచిన ఎమ్మెల్యేలను, ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టి వాలంటీర్ల ద్వారా పనులు చేయించి ప్రజా ప్రతినిధులతో సంబంధం లేకుండా ప్రజలను సచివాలయాలకే పరిమితం చేయడంతో నేతలు సైతం విస్మయానికి గురయ్యారు. దీనికి తోడు అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం పై గుర్రుగా ఉన్నారు. దీంతో జరిగిన ఎన్నికల్లో సైలెంట్‌గా తమ సత్తా చాటారు. ప్రజలు సైతం వైసీపీ నోటు తీసుకొని కూటమికి ఓటు వేశారు. దీంతో వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు.

**కూటమి కట్టినప్పుడే సగం విజయం ఖాయం**

కూటమి కట్టినప్పుడే సగం విజయం ఖాయమైపోయిందని అప్పుడే భావించాయి టీడీపీ, జనసేన, బీజేపీ. ఇప్పుడు వాళ్ల అంచనాలు అక్షరాలా నిజమయ్యాయి. కూటమి విజయకేతనం ఎగరవేసింది.





ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సత్తా చాటింది. చంద్రబాబు అరెస్ట్ అంశం ఈ ఎన్నికల్లో చాలా పెద్ద ఎఫెక్ట్ చూపిందని సర్వత్రా వినిపిస్తోంది. సైలెంట్‌గానే ఈ విషయం వైసీపీకి పెద్ద దెబ్బ వేసినట్లు కనిపిస్తోంది. ఇది టీడీపీకి సానుకూల అంశం అనే వాదన వినిపిస్తోంది. రాజధాని మార్పు కూడా వైసీపీకి గట్టిగా దెబ్బకొట్టినట్లు కనిపిస్తోంది. రాజధాని మారుస్తానని ప్రకటించడం తప్ప ఐదేళ్లుగా వైజాగ్‌కు చేసింది కూడా ఏమీ లేదు. ఇది టీడీపీ విజయానికి అనుకూలించిందనే టాక్ వినిపిస్తోంది. కమలంతో జత కట్టడం టీడీపీకి ప్లస్ పాయింట్ అని చెప్పుకోవచ్చు. దీని కారణంగానే కొత్త ఉత్సాహం వచ్చినట్లు కనిపించింది. టీడీపీ భారీ మెజారిటీతో గెలుపొందటానికి కారణంగా నిలిచింది. భూములను రీసర్వే చేయడం, పాస్ బుక్‌లపై జగనన్న ఫొటో వేయడం లాంటి అంశాలు కూడా ఎన్నికల ముందు పెద్ద చర్చకు దారి తీశాయి. దీని వల్ల కూడా వైసీపీ పై ప్రతికూల ప్రభావం పడిందని అనుకోవచ్చు. ఇది టీడీపీకి సానుకూలించింది. టీడీపీ మేనిఫెస్టో ఆకర్షణగా నిలిచింది. పలు ప్రజాకర్షణ పథకాలు ఇందులో ఉన్నాయి. టీడీపీకి మరింత మైలేజ్ వచ్చిందని అనుకోవచ్చు. కానీ వైసీపీ మేనిఫెస్టో అంతంత మాత్రంగానే ఉంది తప్ప కొత్తగా ఏమీ లేదు. ప్రస్తుత స్కీమ్స్‌నే కొనసాగించారు. అది వైసీపీకి మారినట్టు స్పష్టమవుతోంది. ఈ క్రమంలో జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి తన సత్తా చూపింది.

**ఉమ్మడి ప్రకాశం జిల్లాలో**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై టిడిపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి 50,199 వేల ఓట్లు పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. టిడిపి ఎమ్మెల్యేలుగా ఒంగోలు దామచర్ల జనార్దన్ 34,100 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కనిగిరి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి 11,820 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సంతనూతలపాడు బీఎన్ విజయ్ కుమార్ 30,385 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మార్కాపురం కందుల నారాయణరెడ్డి 13,979 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

కొండేపి డోలా బాల వీరాంజనేయ స్వామి 23,511 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గిద్దలూరు ముత్తుముల అశోక్‌రెడ్డి 1014 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పర్చూరు ఏలూరి సాంబ శివరావు 22,221 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. చీరాల ఎంఎం కొండయ్య 20,550 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అద్దంకి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ 22,002 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కందుకూరు ఇంటూరి నాగేశ్వరరావు 17,813 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాగా యర్రగొండపాలెంలో మాత్రం వైసిపి ఎమ్మెల్యేగా తాటిపర్తి చంద్రశేఖర్ 5477 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దర్శిలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి 2597 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలుగా నిలిచారు. కాగా ఇంతటి టిడిపి గాలి తామెప్పుడూ చూడలేదని అన్ని పార్టీల ప్రజలు చర్చించుకుంటున్నారు. వైసీపీ నాయకులు మాత్రం నవరత్నాల పేరుతో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తే కనీసం తమకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా విస్మరించడం బాధాకరంగా ఉందని పేర్కొంటున్నారు.

## ఉమ్మడి నెల్లూరు జిల్లా క్లీన్ స్వీప్ చేసిన టిడిపి కూటమి

మొదట ఆత్మకూరు వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధిక్యతలో కొనసాగారు. నెల్లూరు మేకపాటి కార్యాలయంలో విక్రమ్‌రెడ్డి తండ్రి మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైసిపి నాయకలు విజయం సాధించాకుండానే సంబరాలు చేసుకున్నారు.



















## ఆర్యవైశ్య టీడీపీ నాయకుల సంబరాలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 4)

జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్దన్ 34 వేల మెజార్టీతో గెలవడంతో ఆర్యవైశ్య టిడిపి నాయకులు కనమర్లపూడి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఒంగోలులోని మోహన్ లాడ్జి ఎదురు బాణాసంచా కాల్చి, కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. హరి ప్రసాద్ మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో చరిత్రను తిరగరాసి ఎక్కువ మెజార్టీతో గెలవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాదర్తి కోటేశ్వరరావు, కొంకిమల్ల శ్రీనివాస్‌రావు, ముమ్వల నాగరాజు, కొప్పిరావూరు సురేష్, సామి సత్యనారాయణ, టంగుటూరి రంగస్వామి, అమరా లక్ష్మి వెంకట సత్యనారాయణ, గుర్రం రంగనాథ్, శివ, చెంచయ్య, ఆర్యవైశ్య మిత్రులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి దంపతులకు శుభాకాంక్షలు




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 4)


సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్డీఏ నెల్లూరు పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందిన వేమి రెడ్డి ప్రభాకర్ రెడ్డిని, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డిని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి , ఆయన సతీమణి టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకపాటి శాంతి కుమారిలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


# ప్రకాశం విజేతలు వీరే....!





దామచర్ల జనార్థన్‌రావు,
ఎమ్మెల్యే, ఒంగోలు. మెజార్టీ 34,100


కందుల నారాయణరెడ్డి,
ఎమ్మెల్యే, మార్కాపురం. మెజార్టీ 13,979


మాగుంట శ్రీనివాసులరెడ్డి,
ఎంపి, ఒంగోలు. మెజార్టీ 50,199




ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి,
ఎమ్మెల్యే, కనిగిరి. మెజార్టీ 11,820





డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి,
ఎమ్మెల్యే, కొండపి. మెజార్టీ 23,511




బి ఎన్ విజయ్‌కుమార్,
ఎమ్మెల్యే, సంతనూతలపాడు. మెజార్టీ 30,385


ఏలూరి సాంబశివరావు,
ఎమ్మెల్యే, పర్చూరు. మెజార్టీ 22,221


ఇంటూరి నాగేశ్వరరావు,
ఎమ్మెల్యే, కందుకూరు. మెజార్టీ 17,813


బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి,
ఎమ్మెల్యే, దర్శి. మెజార్టీ 2597


ముత్తుముల అశోక్‌రెడ్డి,
ఎమ్మెల్యే, గిద్దలూరు. మెజార్టీ 1014


తాటిపర్తి చంద్రశేఖర్,
ఎమ్మెల్యే, యర్రగొండపాలెం.
మెజార్టీ 5477



# మూడు దశాబ్దాల అనంతరం...



## నెల్లూరుసిటీలో ఎగిరిన టీడీపీ జెండా
## విజయకేతనం ఎగురవేసిన డాక్టర్ పొంగూరు నారాయణ
## 72,489 ఓట్ల మెజార్టీతో నెల్లూరు నగర శాసనసభ్యులుగా గెలుపు
## నారాయణ వైపే మొగ్గుచూపిన నెల్లూరు నగర ఓటర్లు
## కలిసి వచ్చిన నారాయణ అభివృద్ధి మంత్రం
## వరంగా మారిన వైసీపీ అసమ్మతి
## ఇక వైసిపి కోటకు బీటలే
## ఆనందోత్సవాల్లో కూటమి శ్రేణులు, నెల్లూరునగర ప్రజలు
## ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చిన డాక్టర్ పొంగూరు నారాయణ

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, నెల్లూరు, జూన్ 4)**

నెల్లూరు నగర నియోజకవర్గంలో మూడు దశాబ్దాలు అంటే 30 సంవత్సరాల చరిత్రను డాక్టర్ పొంగూరు నారాయణ తిరగరాశారు. ప్రజాధరణతో కనీవినీ ఎగురని రీతిలో 72,489 ఓట్ల ఆధిక్యతతో నెల్లూరు సిటీ నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ జెండా రెపరెపలాడింది. డాక్టర్ పొంగూరు నారాయణ భారీ విజయం సొంతం చేసుకున్నారు. ప్రజలంతా నారాయణ అభివృద్ధి మంత్రం వైపే మొగ్గుచూపారు. దానికి తోడు టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణుల సంపూర్ణ మద్దతు కలిసివచ్చింది. ఇదిలాఉంటే వైసీపీలో నెలకొన్న అసమ్మతి కూడా డాక్టర్ పొంగూరు నారాయణకు ప్లస్ పాయింట్ అయింది. దీంతో విజయం వచ్చి నారాయణ చెంత చేరింది. దాదాపు మూడు దశాబ్ధాల అనంతరం నెల్లూరు సిటీలో టీడీపీ జెండా రెపరెపలాడింది. ఫలితంగా నెల్లూరు సిటీ ఇక అభివృద్ధి మయమేనని ఇటు పార్టీల శ్రేణులు, ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఆనందోత్సవాల్లో కూటమి శ్రేణులు

2024 సార్వత్రిక ఎన్నికల్లో....మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ 72,489 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడంతో కూటమి శ్రేణులు సంబరాలు చేశారు. తన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి షేక్ ఖలీల్ అహ్మద్ పై...పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నుంచి ప్రతీ రౌండ్‌లోనూ నారాయణ ముందంజలో ఉన్నారు. తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపొంది... ఎమ్మెల్యేగా శాసన సభలో ఆయన అడుగు పెట్టనున్నారు. ప్రధానంగా ఈ విజయానికి 2014 నుంచి 2019 వరకు ఆయన చేసిన అభివృద్ధే కారణమని సంతోషం వ్యక్తం చేశారు. నారాయణ విజయకేతనంతో... అటు కుటుంబ సభ్యులు..ఇటు టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు చేసుకున్నారు. టీడీపీ కార్యాలయాలు, నారాయణ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నేతలు, మహిళలు నృత్యాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. నెల్లూరు జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్ చేయడంతో... టీడీపీ నేతల ఆనందానికి అవదుల్లేవ్.

### ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
### నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణ

2024 సార్వత్రిక ఎన్నికల్లో తనపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని డాక్టర్ పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. ఫలితాల వెల్లడి అనంతరం డిక్లరేషన్ ఫారం అందుకున్న ఆయన కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కాలేజీ వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో...72,489 ఓట్లతో విజయం సాధించడం జరిగిందన్నారు. మొత్తం ఓట్లు 2 లక్షలా 39వేల అని...అందులో లక్షా 72వేల ఓట్లు పోల్ అయ్యాయన్నారు. అంటే 42 శాతం ఓటింగ్ పోలైందని...ఇది నెల్లూరు సిటీ చరిత్రలో ఇప్పటి వరకు లేదన్నారు. ఇంత భారీ విజయాన్ని అందించిన నెల్లూరు సిటీ ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిజేస్తున్నానని.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. నెల్లూరుసిటీలోని సమస్యలన్నింటిని పూర్తి చేస్తానన్నారు. అదే విధంగా 2014 నుంచి 2019 వరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని...కొన్ని మిగిలిపోయాయని...వాటిని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకుండా వదిలేసిందన్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క వర్క్ కూడా పెండింగ్ లో లేకుండా పూర్తి చేస్తానన్నారు. జగన్ అరాచక పాలన కారణంగానే...ఈ ఎన్నికల్లో వైసీపీని ప్రజలు సింగిల్ డిజిట్‌కే పరిమితం చేశారన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పాలన సర్వనాశనం చేశాడన్నారు. టీడీపీ విజయానికి కార్యకర్తలు ఎంతో శ్రమించారన్నారు. అందుకోసమే కార్యకర్తలకు అండగా ఉండాలన్న ఉద్దేశంతోనే నా కుటుంబ సభ్యులంతా కలిసి ఏడాదికి వారి సంక్షేమానికి రూ. 10 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు.

### ఫలించిన నారాయణ అభివృద్ధి మంత్రం

నెల్లూరు నియోజకవర్గం 2014 నుంచి వైసీపీ కి కంచుకోటగా ఉండేది. 2014, 2019లో పోలుబోయిన అనీల్ కుమార్ వైసిపి పార్టీ తరపున విజయం సాధించారు. అయితే ఈ దశాబ్దం కాలంలో అభివృద్ధి కుంటుపడింది. 2014లో మంత్రి పదవి చేపట్టిన డాక్టర్ పొంగూరు నారాయణ వేలాది కోట్ల రూపాయలు నిధులతో నియోజవర్గం ముఖచిత్రం మారేలా అభివృద్ధి పనులు చేపట్టారు. 2024 ఎన్నికల ప్రచారంలో డాక్టర్ పొంగూరు నారాయణ ప్రతి నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ తన ఆలోచనలను ప్రజలతో పంచుకున్నారు. అభివృద్ధి మంత్రాన్ని ప్రజలకు వినిపించారు. దీంతో నియోజకవర్గంలో ఏ డివిజన్‌లో ప్రచారానికి వెళ్లినా ఓటర్లు నారాయణ అభివృద్ధికి జేజేలు పలుకుతూ ఆయన వెంట నడిచారు. ఓ వైపు తెలుగుదేశం బలం.. మరో వైపు నారాయణ అభివృద్ధి మంత్రం వెరసి వైసిపి కోటను బద్దలు కొట్టేలా నారాయణ వైపు ఓటర్లు అధిక శాతం నిలబడ్డారని... అదే నారాయణ గెలుపునకు సోపానమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనేతలంతా నారాయణ గెలుపును తమ గెలుపుగా భావించి.. వారి వర్గీయులు పూర్తి అండదండలు అందించారు. తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ కూటమిగా కలవడంతో నియోజవర్గంలో ఆ పార్టీ ఓటర్ల ఓట్లంతా మూకుమ్మడిగా నారాయణ వైపు నిలబడ్డారని రాజకీయ పరిశీలకులు తెలియజేస్తున్నారు.

### 1998లో రాజకీయ ఆరంగేట్రం

డాక్టర్ పొంగూరు నారాయణకు 1998లో టీడీపీ అధినేత నారా చంద్రబాబుతో పరిచయం రాజకీయాల వైపు తిప్పింది. తొలుత టీడీపీ సర్వే విభాగానికి తన మేధోశక్తిని వినియోగించిన నారాయణ క్రమంగా క్రియాశీల రాజకీయాల వైపు అడుగులు వేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయిన టీడీపీ వెన్నంటి ఆయన చేసిన సేవలు కొద్ది మందికే తెలుసు. అయితే కష్టకాలంలో పార్టీకి వెన్నుదన్నుగా నిలవడంతో పాటు ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడే నారాయణ తపన, పట్టుదల చూసి ఆయన్ని చంద్రబాబు కూడా ఎంతగానో ప్రోత్సహించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి రావడంతో చంద్రబాబు తన మంత్రివర్గంలో డాక్టర్ నారాయణకు స్థానం కల్పించారు. కొత్త రాష్ట్రం అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో కూడా నారాయణకు భాగస్వామ్యం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖలతో పాటు నూతన రాజధాని అమరావతి నిర్మాణంలోనూ నారాయణ కీలక పాత్ర పోషించారు.

### మూడు దశాబ్ధాల తర్వాత నెల్లూరు సిటీలో టీడీపీ జెండా రెపరెపలు

1994లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు నియోజకవర్గం నుంచి తాళ్లపాక రమేష్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా విజయం సాధించి ఆ పార్టీ ఆవిర్భావ అనంతరం రెండవ విజయాన్ని నమోదు చేశారు. అనంతరం నియోజకవర్గాల విభజన జరిగింది. ఈ క్రమంలో మూడు దశాబ్ద కాలాల తర్వాత నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి తొలిసారిగా తెలుగుదేశంపార్టీ నుంచి డాక్టర్ పొంగూరు నారాయణ విజయకేతనం ఎగురవేశారు. నియోజకవర్గ ప్రజలంతా నారాయణ వైపే మొగ్గుచూపారు. డాక్టర్ పొంగూరు నారాయణ అభివృద్ధి మంత్రానికి ఆకర్షితులై పలువురు నేతలు తండోపతండాలుగా వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. దీనికి తోడు వైసీపీలో పొరపచ్చాలు కూడా నారాయణకి లాభించాయి. ఫలితంగా నెల్లూరు సిటీ శాసనసభ్యులుగా డాక్టర్ పొంగూరు నారాయణ విజయం సుసాధ్యమైంది.

### ఆనందోత్సవాల్లో నెల్లూరు నగర ప్రజలు, పార్టీల శ్రేణులు

నెల్లూరు నగర శాసనసభ్యులుగా డాక్టర్ పొంగూరు నారాయణ 72,489 ఓట్ల మెజార్టీతో విజయం సాధించడంతో నగర ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులతో పాటు రాష్ట్రంలోని అభిమానులంతా ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. తమ నేత నారాయణ గెలుపుతోనే రాష్ట్రంతో పాటు నెల్లూరు నగరం అభివృద్ధి చెందుతుందని వారంతా ఆశాభావం వ్యక్తం చేశారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

# ప్రజా సేవకుడు సునీల్ కుమార్ ఘన విజయం

## టిడిపికి పట్టం కట్టిన గూడూరు నియోజకవర్గ ప్రజలు



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌చార్జి, జూన్ 4)** సునీల్ కుమార్ గెలుపుతో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లోనూ నూతన ఉత్సాహంతో సంబరాలు చేసుకున్నారు. తిరుపతి జిల్లా సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్డీఏ కూటమి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగా మురళీధర్ పై 23023 ఓట్లు మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో భాగంగా మంగళవారం పోలింగ్ ఓట్లను లెక్కించడంతో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ 102675 రాగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్‌కు 81483 ఓట్లు రాగా మురళీధర్ పై సునీల్ కుమార్ 23,023 ఓట్లు మెజారిటీ రావడంతో నియోజకవర్గంలోని ప్రజల్లోనూ కార్యకర్తలు, నాయకులు నూతన ఉత్సాహంతో సంబరాలు జరుపుకున్నారు.

# పొదిలిలో కూటమి నాయకుల సంబరాలు

## జనసేన ఆధ్వర్యంలో నిర్వహణ



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 4)** పట్టణంలోని స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్లో జనసేన నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి ఆనందాత్సవాలు జరుపుకున్నారు. ఒకరికొకరు కేక్ తినిపించుకొని కూటమి నాయకులు గెలుపు సంబరాలు చేసుకున్నారు. గెలుపు సంబరాల్లో షేక్ రసూల్, షేక్ యాసిన్, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గునుపూడి ఇంటి వద్ద టీడీపీ నాయకుల సంబరాలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 4)**

పొదిలి గునుపూడి భాస్కర్ నివాసం వద్ద తెలుగుదేశం పార్టీ విజయం సాధించినందుకు మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి శాసనసభ్యులుగా ఎన్నికైన కందుల నారాయణరెడ్డి ఘనవిజయం సాధించినందుకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి, కందుల నారాయణ రెడ్డికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఇంటి వద్ద తెలుగుదేశంపార్టీ నాయకులు సంబరాలతో కోలాహలంగా మారింది. ఎన్డీఏ కూటమికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# ఇది ప్రజల చారిత్రాత్మక తీర్పు

## ప్రజా కంఠక పాలనకు స్వస్తి పలికిన ఆంధ్ర ఓటర్లు
## ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది
## ప్రతి కుటుంబాన్ని ఆదుకునే విధంగా కూటమి పాలన అందిస్తుంది
## దుర్మార్గ పాలనను ఇంటికి పంపిన ప్రజల ఓటు
## జిల్లాలో కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు
## తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, డాక్టర్ నూకసాని బాలాజీ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 4)** రాష్ట్రంలో రాక్షస పాలన అంతం చేయడానికి ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పే టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయానికి సంకేతమని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కుతో రాష్ట్రంలో వైసిపి పాలనను అంతం చేశారని, ప్రజాకంఠక పాలనకు చరమగీతం పాడారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కూటమి అజెండా అని నూకసాని పునరుద్ఘాటించారు. వైసీపీ ప్రభుత్వ అవినీతి వల్లే ఏపీ అభివృద్ధి చెందలేదన్నారు. గత ఐదేళ్లలో ఏపీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి విజయంతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని నూకసాని అన్నారు. వైసిపి దుర్మార్గ పాలల్లో ఇబ్బంది పడిన ప్రతి కుటుంబాన్ని ఆదుకునే విధంగా పరిపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లాలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయాన్ని కృషి చేసిన ప్రతి ఒక్కరికి డాక్టర్ నూకసాని బాలాజీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# కూటమి సునామీలోనూ వైపాలెంలో ఎగిరిన వైసీపీ జండా

## యర్రగొండపాలెంలో వైసీపీ విజయకేతం
## 5477 ఓట్ల మెజార్టీతో వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విజయం

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జూన్ 4)**

ఈ నెల 13వ తేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు లెక్కింపు మంగళవారం ఒంగోలులో జరిగింది. ఈ ఫలితాలలో యర్రగొండపాలెం నియోజకవర్గంను వరుసగా నాలుగోసారి వైసీపీ కైవసం చేసుకుంది. తాటిపర్తి చంద్రశేఖర్ 2024వ సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పై 5477 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అంతకు ముందు 2009 సంవత్సరంలో డాక్టర్ ఆదిమూలపు సురేష్ 2014 సంవత్సరంలో పాలపర్తి డేవిడ్ రాజు, 2019లో ఆదిములపు సురేష్ 32 పైచిలుకు మెజార్టీతో గెలుపొంది పశ్చిమ ప్రకాశం జిల్లాలోనే వైసిపి కంచుకోటగా యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని పేరు ప్రఖ్యాతలుగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం



పార్టీ సునామి సృష్టించింది. రాష్ట్రంలో టిడిపి కూటమికి 150 సీట్లు రాగా, వైసీపీ మాత్రం పది సీట్లకే పరిమితమైంది. ఎంపీ సీట్లకు గాను మాగుంట శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్రవ్యాప్తంగా 25 పార్లమెంటు స్థానాలకు గాను టిడిపి 22, వైసీపీ మూడు స్థానాలు కైవసం చేసుకుని వైసిపి ఘోర పరాజయానికి దారి తీసింది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ కేవలం పెద్దారవీడు, దోర్నాల మండలాల నుంచి విజయకేతానికి దారి తీసింది. త్రిపురాంతకం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాలు పోటాపోటీగా ఓట్లు సాధించాయి. ఈ టీడీపీ సునామీలో రాష్ట్రవ్యాప్తంగా వైసిపి 10 స్థానాల గాను ఒక స్థానంగా యర్రగొండపాలెం నియోజకవర్గ నుంచి తాటిపర్తి చంద్రశేఖర్ విజయం సాధించారు.

# పిన్నెల్లి కోటను బద్దలుకొట్టిన జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 4)** మాచర్ల పట్టణంలో మే 13వ తేదీ జరిగిన ఎన్నికల పోలింగ్ సమయంలో అల్లర్లతో దేశవ్యాప్తంగా సంచలనమైన పల్నాడు జిల్లా మాచర్లలో టీడీపీ గెలుపొందింది. అక్కడ టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఘన విజయం సాధించారు. ప్రత్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై 30వేలకు పైగా మెజార్టీతో గెలుపొందారు. దీంతో 20 ఏళ్లుగా మాచర్లను ఏలుతున్న పిన్నెల్లి కోటను టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి బద్దలు కొట్టినట్లయింది.



## విజయ్‌కుమార్‌ను కలిసిన మద్దిపాడు టీడీపీ నాయకులు





(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జూన్ 4)
సంతనూతలపాడు నియోజకవర్గ కూటమి టిడిపి అభ్యర్థి బి ఎన్ విజయ్ కుమార్ 30,385 ఓట్లతో ఘన విజయం సాధించారు. విజయం సాధించిన విజయ్ కుమార్‌ని మద్దిపాడు మండల టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్) , మండవ వెంకటేశ్వర్లు, పెద్దకొత్తపల్లి టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

## అఖండ మెజార్టీతో గెలిచిన కూటమి అభ్యర్థి నెలవల విజయశ్రీ

### 29,115 ఓట్లతో భారీ మెజార్టీ



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌చార్జి, జూన్ 4)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ,జనసేన,బిజెపి బలపరిచిన నెలవల విజయశ్రీ 29115 ఓట్లతో విజయం సాధించారు. ఉమ్మడి అభ్యర్థి తరపున సీటు ఇచ్చినప్పటి నుంచి తనదైన శైలిలో ప్రచారం చేస్తూ అందరిని కలుపుకుంటూ ప్రతి మండలంలో ప్రతి పంచాయతీలో ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ ప్రచారం నిర్వహించి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. మొదట నుంచి చివరి వరకు మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ప్రతి ఒక్కరికి చెబుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు వెళతానని తెలిపారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి మీద ఉన్న వ్యతిరేకత, జగన్మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలు విసుగుచెంది ఉమ్మడి ప్రభుత్వానికి ప్రజల మద్దతు సంపూర్ణంగా తెలిపారని విజయశ్రీ తెలిపారు.

## కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కోటపోలూరు యూత్



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జూన్ 4)
తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట మండలం కోటపోలురు గ్రామంలో టీడీపీ జెండాలతో రెపరేపలాడిన కోటపోలూరు గ్రామం పంచాయతీ మొత్తం పసుపు మయంగా మారింది. రూలర్ మండల ఉపాధ్యక్షుడు వాసం సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు, సూళ్లూరుపేట కూటమి నెలవల విజయశ్రీని భారీ మెజారిటీతో గెలవడం తో వాసం రెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు కోటపోలూరు పంచాయతీ కేక్ కటింగ్ చేశారు. ఇందులో చిన్నపిల్లల నుంచి ముసలి వారి దగ్గర నుంచి ఒకే నినాదం జై తెలుగుదేశం, జై తెలుగుదేశం. కార్యక్రమంలో ముఖ్యంగా రూరల్ యువత ప్రధాన కార్యదర్శి కే. కిషోర్, రూరల్ మండలం ఎస్ ఎస్ సి ఎల్ ఈదురు అరుణ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పి. నాగరాజు ఆర్.శివయ్య నిరంజన్ హరి ధన వంశీ మొక్ష స్టాలిన్ పాల్గొన్నారు.

# హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యే స్వామి

### భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే స్వామి
### కొండపి నియోజకవర్గంలో 23,511 ఓట్ల మెజార్టీ
### టీడీపీ సీనియర్ నాయకుడు
### పులి ప్రసాద్ యాదవ్, పులి మాలకొండయ్య యాదవ్



(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 4)
కొండపి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడిగా పోటీ చేసి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించడమే గాక కొండపి కోటపై మూడోసారి ముచ్చటగా హ్యాట్రిక్ సాధించి 23,511 ఓట్లు భారీ మెజార్టీతో విజయం సాధించిన అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితులు అందరివాడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొండపి తెలుగుదేశం పార్టీ శాసనసభకు గెలుపొందిన డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి గెలవడం ఎంతో శుభసూచికమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పులి ప్రసాద్ యాదవ్, పులి మాలకొండయ్య యాదవ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తరపున ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులుగా గెలుపొందిన 134 సీట్లకు పైగానే విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులకు పేరుపేరునా పులి బ్రదర్స్ పులి ప్రసాద్ యాదవ్, పులి మాలకొండయ్య యాదవ్ ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడం ఎంతో శుభసూచకమని వారు తెలిపారు. బిజెపి,జనసేన,టిడిపి మూడు పార్టీలు కలిసి ఉమ్మడి ఎన్ డి ఏ ఆధ్వర్యంలో పనిచేసి రాష్ట్రంలోని 175 నియోజకవర్గంలో 134 సీట్లు పైగానే విజయం సాధించడం ఎంతో గొప్ప విశేషమని పులి ప్రసాద్ యాదవ్, పులి మాలకొండయ్య యాదవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.





ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుపరిచే విధంగా కూటమి అభ్యర్థులు ఎంతో కృత నిశ్చయంతో ముందుకు సాయి ప్రజలకు రాష్ట్రంలో సుపరిచిత పరిపాలన అందిస్తారని ప్రధానంగా అన్నదాతలకు అండగా నిలుస్తారని పులి ప్రసాద్ యాదవ్ పులి మాలకొండయ్య యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. కొండపి తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడిగా విజయం సాధించిన డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆయనపై ఉన్న అపార నమ్మకంతో ప్రజలు జరిగిన సార్వత్ర ఎన్నికల్లో ఎమ్మెల్యే స్వామి పై ఉన్న నమ్మకంతో నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలు ఆయనకి అత్యధిక భారీ మెజార్టీ తెప్పించడమే గాక కొండపి తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడిగా మూడోసారి ముచ్చటగా విజయం సాధించే దిశగా ఓటర్లు ముందుకు అడుగు వేసి ఆయన్ని కొండపి తెలుగుదేశం పార్టీ సాధన సభ్యుడిగా గెలిపించుకుని తీరారని పులి ప్రసాద్ యాదవ్, పులి మాలకొండయ్య యాదవ్ నియోజకవర్గం ఓటర్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఏది ఏమైనా ఎమ్మెల్యే డాక్టర్ స్వామి ఆధ్వర్యంలో రైతులకు సాగు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, సాగునీటి చెరువులు రిపేరు కార్యక్రమాలకు జిల్లెలమూడి డ్యాం లోపల భాగంలో ఇసుక తీయించి ఏటి ద్వారా రైతులకు ప్రధానంగా సాగునీరు తీసుకు వచ్చే విధానంలో ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తాడని ఎమ్మెల్యే డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి సేవలు కొండపి నియోజకవర్గం ప్రజలకు ఎంతో అవసరం అని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకు నడిపిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి పట్ల ప్రత్యేకంగా పులి ప్రసాద్ యాదవ్ , పులి మాలకొండయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం పనిచేసిన రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గెలుపొందిన దేశం పార్టీశాసనసభ్యులకు, కార్యకర్తలకు, నాయకులకు అభిమానులకు ప్రత్యేకంగా పేరుపేరున పులి ప్రసాద్ యాదవ్, పులి మాలకొండ యాదవ్ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 4)
ఒంగోలు నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. అధికారం, ధనబలం ఎప్పటికి శాశ్వతం కావనే విషయాన్ని గుర్తుంచుకోవాలని బాలినేని శ్రీనివాసులు రెడ్డికి పరోక్షంగా సూచించారు. ఎన్నికల రోజు వెంగముక్కపాలెం పోలింగ్ కేంద్రంలో దళితులపై బాలినేని కోడలు కావ్య చెప్పుతో దాడి చేసిందని, ప్రణీత్ రెడ్డికి, కావ్యకు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. దీంతో బాలినేని శ్రీనివాసులు రెడ్డి, ప్రణీత్‌పై రౌడీషీట్లు తెరవాలని, దాడి చేసిన కావ్యపై కేసు నమోదు చేయాలని కోరామన్నారు. బాలినేని శ్రీనివాసులు రెడ్డి సంస్కారం లేకుండా మాట్లాడుతానని, ఆడవాళ్ళ జోలికి వెళ్ళినట్లు ఇష్టారీతిన మాట్లాడారన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు మహిళల జోలికి వెళ్ళదని స్పష్టం చేశారు. గతంలో బాలినేని పనైపోయిందని చెప్పానని, ఆయన, కొడుకు హైదరాబాద్‌కి మకాం మారుస్తారన్నారు. ఒంగోలును గంజాయి రహిత నగరంగా మారుస్తామని, గంజాయి బ్యాచ్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.గతంలో చేసిన అభివృద్ధిని చూసి ఒంగోలు నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించినందుకు వారి నమ్మకాన్ని నిలబెడతానన్నారు. బ్యాడ్ కామెంట్స్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. నియోజవర్గంలో మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలన్ని పూర్తి చేస్తారన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను తగిన స్థానం కల్పిస్తామన్నారు. విజయం కోసం కోసం పనిచేసిన టిడిపీ, జనసేన, బిజెపి నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



## అర్ధవీడు మండలంలో వైసీపీకి 2457 మెజారిటీ

(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జూన్ 4)
ఈ నెల 13న జరిగిన అసెంబ్లీ అసెంబ్లీ ఎన్నికల నందు గిద్దలూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి ముత్తుముల అశోక్ రెడ్డి విజయం సాధించారు. అర్ధవీడు మండలంలో 2457 మెజార్టీ వైసీపీ రావడం జరిగింది. వెలగలపాయ పంచాయతీలో 769 టిడిపికి రాగా, 530 వైసిపికి 239, టిడిపి మెజారిటీ సాధించింది. గన్నెపల్లి పంచాయతీ నందు టీడీపీకి 378, వైసీపీకి 478, వైసీపీకి 100 మెజారిటీ, రంగాపురం పంచాయతీలో 403 టిడిపికి 553, వైసీపీకి 150 వైసిపికి మెజారిటీ రావడం జరిగింది. యాచవరం పంచాయతీ నందు 743 టిడిపికి 741, వైసీపీకి టిడిపికి రెండు ఓట్లు మెజారిటీ , మాగుటూరు పంచాయతీ నందు 851 టీడీపీకి 1094, వైసీపీకి 243 వైసిపికి మెజారిటీ, కాకర్ల పంచాయతీ నందు 917 టిడిపికి 900 వైసీపీకి రాగా 17 ఓట్లు టిడిపికి మెజారిటీ, నాగులవరం పంచాయతీ నందు 684 టిడిపికి రాగా 887, వైసీపీకి 193, వైసిపి మెజారిటీ , పెదకద్దుకూరు పంచాయతీ నందు 527 టిడిపికి 850 వైసీపీకి రాగ 323 వైసిపికి మెజారిటీ వచ్చింది. దొనకొండ పంచాయతీ నందు 609 టీడీపీకి 687 వైసీపీకి రాగా 78 వైసీపీకి మెజారిటీ, అర్ధవీడు పంచాయతీ నందు 1385 టిడిపికి 2038 వైసీపీకి రాగా 663 వైసీపీకి మెజారిటీ, బొల్లుపల్లి పంచాయతీ నందు 805 టీడీపీకి రాగా 852 వైసీపీకి రాగా 47 వైసిపికి మెజారిటీ, పాపనిపల్లి పంచాయతీలో 1135 టిడిపికి రాగా 1637 వైసిపికి రాగా 502 వైసీపీ మెజారిటీ, మొహిద్దీన్ పురం పంచాయతీలో 554 వైసీపీ టిడిపికి 849 వైసీపీగా 295 వైసీపీ మెజార్టీ మెజారిటీ, బోగోలు పంచాయతీలో 339 టిడిపికి రాగా 478 వైసీపీకి 139 వైసీపీ మెజార్టీ వచ్చింది. మొత్తం మీద 2457 మెజారిటీని వైసీపీ సాధించడం జరిగింది.

## పెద్దిశెట్టి చంద్ర, వరలక్ష్మి ఆధ్వర్యంలో సంబరాలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 4)
జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్ధన్‌రావు ఒంగోలు చరిత్రలోనే 34,100 అఖండ మెజార్టీతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఒంగోలులోని 29వ డివిజన్‌లో పెద్దిశెట్టి చంద్ర వరలక్ష్మి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అత్యధిక మెజార్టీతో గెలిచిన దామచర్ల జనార్దన్, అలాగే సీఎం కాబోతున్న నారా చంద్రబాబునాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రిలేషన్‌షిప్‌లో ఉన్నారా?

'బేబమ్మ' (ఉప్పెన చిత్రం)గా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నటి కృతిశెట్టి త్వరలోనే 'మనమే' తో అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా ప్రచారంలో పాల్గొన్న ఆమె ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. ఈ క్రమంలోనే 'మీరు సింగిలా? రిలేషన్‌షిప్‌లో ఉన్నారా?' అని హోస్ట్ అడగ్గా "నా పనితో రిలేషన్‌లో ఉన్నా" అంటూ నవ్వులు పూయించారు. కాబోయేవాడు ఎలా ఉండాలన్న ప్రశ్నపై స్పందిస్తూ.. నిజాయతీ, ఇతరులపై దయ కలిగి ఉండాలన్నారు. సినిమాల గురించి మాట్లాడుతూ.. "డ్యాన్స్ చేయడమంటే నాకు బాగా ఇష్టం. యాక్షన్ కూడా నచ్చుతుంది. హీరోల్లో రామ్ చరణ్ అభిమానిని. ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తా. ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు 'మనమే' చిత్రంలో ఉన్నాయి. నేనిందులో సుభద్ర అనే యువతిగా కనిపిస్తా. పాత సినిమాల్లో చేసిన పాత్రల్ని మరిచిపోయి ఇందులో నటించమని చెప్పారు దర్శకుడు. ఈ పాత్ర ప్రయాణం చాలా తృప్తినిచ్చింది. నేను చిన్నారికి తల్లిగా కనిపిస్తానా? లేదా? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. సినిమా, సినిమాకీ వైవిధ్యాన్నే కోరుకుంటా. చేసిన పాత్రల్నే మళ్లీ మళ్లీ చేయడం నాకు నచ్చదు" అని తెలిపారు. శర్వానంద్ హీరోగా దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మనమే'. జూన్ 7న విడుదల కానుంది.

# 'సూర్య 44' షురూ



త్వరలో 'కంగువా'తో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్నారు తమిళ కథానాయకుడు సూర్య. ప్రస్తుతం వరుస సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్న ఆయన.. తన 44వ చిత్రం కోసం దర్శకుడు కార్తీక్ సుబ్బరాజుతో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. పూజా హెగ్డే కథానాయిక. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. "లైట్స్, కెమెరా, యాక్షన్.. 'సూర్య 44' ప్రయాణం ప్రారంభమైంద"ని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో సూర్య సరికొత్త లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. లవ్ అండ్ వార్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తుంది. జోజు జార్జ్, జయరామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

# జోడీ కుదిరిందా?





కథల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తూ వస్తోంది రీతూ వర్మ. గతేడాది అనువాద చిత్రం 'మార్క్ ఆంటోని'తో సినీప్రియుల్ని అలరించిన ఈ తెలుగందం.. ప్రస్తుతం శ్రీవిష్ణుతో కలిసి 'స్వాగ్'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇది ముగింపు దశ చిత్రీకరణలో ఉంది. కాగా, రీతూ ఇప్పుడు తెలుగులో మరో అవకాశం దిపుచ్చుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సందీప్ కిషన్ హీరోగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో సందీప్‌కు జోడీగా రీతూ వర్మ కనిపించనుందని సమాచారం. ఇప్పటికే ఈ విషయమై ఆమెతో సంప్రదింపులు పూర్తయినట్లు తెలుస్తోంది. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానున్న ఈ సినిమాలో 'మన్మథుడు' ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్. ఈనెల మూడో వారం నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# 'పుష్ప 2' సాంగ్.. 500 మందికిపైగా డ్యాన్సర్లు
## కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య



కొన్ని రోజుల క్రితం విడుదలై, చాలామంది ఫేవరెట్ సాంగ్స్ లిస్ట్‌లో చేరిపోయింది 'సూసేకి' 'పుష్ప 2' లోని ఈ పాట యూట్యూబ్‌లో అత్యధిక వ్యూస్‌తో దూసుకెళ్తోంది. అల్లు అర్జున్ – రష్మిక కెమిస్ట్రీ, హుక్ స్టెప్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పాటకు నృత్యరీతులు సమకూర్చిన గణేశ్ ఆచార్య ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. "సూసేకి.. స్వీట్ సాంగ్. గ్రాండ్‌గా ఉంటుంది. ఇటీవల విడుదల చేసిన లిరికల్ వీడియోలో మేకింగ్ మాత్రమే చూపించాం. అసలైన డ్యాన్స్ చూడాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. ఎనిమిది రోజుల్లో ఈ పాట చిత్రీకరణ పూర్తయింది. 500 మందికి పైగా డ్యాన్సర్లు పాల్గొన్నారు. కపుల్స్ కూడా తేలిగ్గా డ్యాన్స్ చేయగలిగేలా హుక్ స్టెప్ ఉండాలని ముందే ఫిక్స్ అయ్యా. దానికి తగ్గట్టే కొరియోగ్రఫీ చేశా. అల్లు అర్జున్–రష్మిక తమ డ్యాన్స్‌తో అలరిస్తారు" అని పేర్కొన్నారు. అంతకుముందే రిలీజైన టైటిల్ సాంగ్ 'పుష్ప.. పుష్ప' కూడా మంచి ఆదరణ దక్కించుకుంది.

'పుష్ప 1'లోని ప్రత్యేక గీతం 'ఊ అంటావా మావ..'కి కొరియోగ్రఫీ చేసింది గణేశ్ ఆచార్యే. 'పుష్ప 1' ఘన విజయం అందుకోవడం, అందులోని నటనకుగాను అల్లు అర్జున్‌కు జాతీయ అవార్డు రావడంతో పార్ట్ 2పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. 'ఊ అంటావా మావ'ను మించేలా 'పుష్ప 2'లో స్పెషల్ సాంగ్ ఉండేలా టీమ్ సన్నాహాలు చేస్తోంది. అందులో బాలీవుడ్ నటి ఆడిపాడే అవకాశాలున్నాయని సమాచారం. సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా మూవీ ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ప్రేమకు లేదు సమయం



ఎలాంటి పాత్ర పోషించినా తన సహజమైన నటనతో సినీప్రియుల్ని మెప్పిస్తుంటుంది కథానాయిక నిత్యా త్వరలో 'కాదలిక్కె నేరమిల్లై' అనే సినిమాతో తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతుంది. నిత్యామేనన్, జయం రవి జంటగా నటిస్తున్న రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రమిది. ఉదయనిధి తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా టీజర్‌ను "ప్రేమకు సమయం లేదు" అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. రవి, నిత్యల మధ్య సాగుతున్న ప్రేమప్రయాణాన్ని చూపిస్తూ మొదలైన ఈ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. యోగిబాబు, లాల్, వినయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తున్నారు.


# కొత్త కబురు చెబుతారా

ఒకవైపు కొత్త సినిమాల విడుదలలు... మరోవైపు కొత్త కలయికల ప్రకటనలతోనూ చిత్రసీమ ఎప్పుడూ సందడిగా కనిపించేది. కానీ కొన్ని నెలలుగా స్తబ్దత నెలకొంది. ఎన్నికలు, ఐపీఎల్ కారణంగా విడుదలలు లేక వేసవి సీజన్ తుడిచి పెట్టుకుపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత మళ్లీ చిత్రసీమలో మునుపటి వాతావరణం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే కొత్త సినిమాల విడుదలలు ఊపందుకున్నాయి. వారం వారం మూడు సినిమాలొస్తున్నాయి. ఈ



నెలలోనే 'కల్కి 2898 ఎ.డి' రాబోతోంది. కొత్త సినిమాల ప్రకటనలకీ రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవలే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వేడుకలో పాల్గొన్న అగ్ర కథానాయకుడు బాలకృష్ణ 'మాది ఓ కాంబినేషన్ ఉంది, త్వరలోనే ప్రకటిస్తామ'ని చెప్పారు. 'విశ్వంభర' చిత్రీకరణతో బిజీగా గడుపుతున్న మరో అగ్ర నటుడు చిరంజీవి నుంచీ ఓ కొత్త ప్రకటన వెలువడే అవకాశాలున్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మోహన్‌రాజా దర్శకత్వంలో, చిరంజీవి కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందనున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. బి.వి.ఎస్.రవి కథని సిద్ధం చేశారు. సాయిదుర్గా తేజ్ సహా యువ కథానాయకులు నటించే పలు చిత్రాలు అధికారిక ప్రకటన కోసం సిద్ధమవుతున్నాయి.

# సినిమా ప్రపంచంలోకి హీరామండీ తారలు



వేశ్యలుగా కనిపించే లాహోర్ మహారాణుల మెరుపులు.. ప్రేక్షకులను కట్టిపడేసే తారల నృత్యాలు.. తెర నిండుగా కనిపించే భారీ సెట్‌లతో రూపొందిన సిరీస్ 'హీరామండీ:ది డైమండ్ బజార్'. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన ఈ సిరీస్ ఇటీవలే విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. బాలీవుడ్ అందాల తారలు మనీషా కోయిరాలా, సోనాక్షి సిన్హా, అదితీరావ్ హైదరీ, రిచా చద్దా, సంజీదా షేక్, షర్మిన్ సెగల్ పాత్రధారులుగా ముస్తాబైన ఈ సిరీస్.. సినీప్రియులకు ఓ ప్రత్యేక ప్రపంచాన్ని పరిచయం చేసింది. తాజాగా దీనికి కొనసాగింపుగా రెండో సీజన్‌ను ప్రకటించింది సిరీస్ బృందం. ఈ సందర్భంగా భన్సాలీ మాట్లాడుతూ.."హీరామండీ 2'లో ఈ వేశ్యలు లాహోర్‌ను విడిచిపెట్టి సినిమా ప్రపంచంలోకి వచ్చేస్తారు. దేశ విభజన తర్వాత వాళ్లలో చాలా మంది ముంబయి చిత్రపరిశ్రమల్లో స్థిరపడతారు. ఇప్పుడు కూడా నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ మైమరిపిస్తారు. కానీ..ఈసారి నవాబుల కోసం కాదు. ప్రొడ్యూసర్ల కోసం వాళ్ల ఆటాపాటా ఉంటుంది. మొదటి భాగం కన్నా రెండో సీజన్‌ను మరింత ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నాము. త్వరలో చిత్రీకరణ ప్రారంభిస్తామ"ని చెప్పుకొచ్చారు. మరి ఈసారి లాహోర్ మహారాణుల సందడి ఎలా ఉండనుందో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com